

నెలాఖరులో 'అరకు ఉత్సవ్'
» మూడు రోజుల పాటు నిర్వహణ - 6లో
» అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్‌కుమార్ వెల్లడి

సొసైటీ పర్సన్ ఇన్‌చార్జుల కాల పరిమితి పెంపు -8లో

రైతుబజార్ల ఈఓల బదిలీలు -8లో



తిరుపతికి వందే భారత్?

స్లీపర్ కోచ్‌లతో నడిపే ప్రతిపాదన

» అయితే 6 నెలలు సమయం పడుతుందంటున్న అధికారులు

» 16 కోచ్‌లు, 832 నుంచి 1,128 వరకూ బెర్తులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం నుంచి వందేభారత్ రైళ్ల సంఖ్యను పెంచాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుతం విశాఖ నుంచి నాలుగు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య రెండు, భువనేశ్వర్‌కు ఒకటి, దుర్గ్‌కు మరొకటి వెళుతున్నాయి. తిరుపతి, బెంగళూరు నగరాలకు కూడా విశాఖ నుంచి వందేభారత్ రైళ్లు నడపాలని ప్రజా ప్రతినిధులు రైల్వే అధికారులను కోరారు. అందుకు వారి నుంచి సానుకూల స్పందన వచ్చింది. అయితే ప్రస్తుతం నడుస్తున్న వందే భారత్ రైళ్లు కాకుండా కొత్తగా తయారుచేస్తున్న స్లీపర్ కోచ్ రైళ్లను ఇవ్వనున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. స్లీపర్ క్లాస్ వందేభారత్‌ను తొలుత డిమాండ్ ఎక్కువగా ఉన్న తిరుపతికి నడిపే అవకాశం ఉందంటున్నారు.

తయారీ మందగమనంతో వాయిదా





చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో వందే భారత్ స్లీపర్ క్లాస్ రైళ్లు తయారవుతున్నాయి. వీటిని అత్యంత ఆధునిక టెక్నాలజీతో విలాసవంతమైన సౌకర్యాలతో రూపొందిస్తున్నారు. ఇవి గంటకు 160 కి.మీ. వేగంతో నడుస్తాయి. ప్రతి రైలులో 16 కోచ్‌లు, 832 నుంచి 1,128 వరకూ బెర్తులు ఉంటాయి. ఏసీ కోచ్‌లలో మూడు రకాలు ఉంటాయి. వీటిని ముందు 700 కి.మీ. దూరం పైబడి రాత్రిపూట ప్రయాణం చేసే మార్గాల్లో నడపాలని రైల్వే వర్గాలు నిర్ణయించాయి. స్లీపర్ క్లాస్ రైలు తయారీ పూర్తికాగానే సెప్టెంబరులో ప్రధాని మోదీ చేతులు మీదుగా ఢిల్లీ-శ్రీనగర్‌ల మధ్య ప్రారంభించాలని అనుకున్నారు. అయితే తయారీలో జాప్యం జరుగుతోంది. జనవరిలో మొదటి స్లీపర్ క్లాస్ వందే భారత్ పట్టాలపైకి వస్తుందని చెబుతున్నారు. ఆ లెక్కన చూసుకుంటే విశాఖపట్నం కోటా వచ్చేసరికి ఆరు నెలల సమయం పడుతుందని, జూన్ లేదా జూలైలో విశాఖ-తిరుపతి మధ్య స్లీపర్ క్లాస్ వందేభారత్ మొదలయ్యే అవకాశం ఉందని వాల్తేరు డివిజన్ రైల్వే వర్గాలు తెలిపాయి. ఇందులో టిక్కెట్ ధర రాజధాని ఎక్స్‌ప్రెస్ రేట్లతో సమానంగా ఉంటుందని సమాచారం.



కొనసాగిన వర్షం

» నేడు భారీవర్షసూచన

» మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ప్రభావంతో గురువారం నగరం, శివారు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉదయం కొద్దిసేపు చిరుజల్లులు పడ్డాయి. తరువాత ఆకాశం నిర్మలంగా మారింది. మధ్యాహ్నం నుంచి మళ్లీ మేఘాలు ఆవరించాయి. పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. వరుసగా మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. శుక్రవారం జిల్లాలో వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడా భారీవర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. 21, 22 తేదీల్లో తీరం వెంబడి గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని పేర్కొంది.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

» ఒకటో తేదీ నుంచి అమలుకు సన్నాహాలు

» జిల్లాలో పది కళాశాలలు...

» 5,603 మంది విద్యార్థులు

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు భోజనం అందించగా, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రద్దు చేసింది. ఈ పథకం వల్ల దూర ప్రాంతాల నుంచి కళాశాలలకు వచ్చే విద్యార్థులకు ప్రయోజనం చూకూరుతుందని భావిస్తున్న కూటమి ప్రభుత్వం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించింది.

జిల్లాలోని పది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గల 5,603 మంది ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2,981మంది (1,264 మంది బాలురు, 1,717 మంది బాలికలు), ద్వితీయ సంవత్సరం 2,662 మంది (బాలురు 1,059, బాలికలు 1,603 మంది) ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా పాత జైలు రోడ్డులో గల మహిళా జూనియర్ కళాశాలలో 1,350 మంది, అతి తక్కువగా ఆనందపురం జూనియర్ కళాశాలలో 25 మంది ఉన్నారు.

రేషన్ బియ్యం రవాణా వ్యవహారంలో...

గోడౌన్ సూపర్‌వైజర్లు అరెస్టు

» 11 కంటెయినర్లు సీజ్

మల్కాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

డాక్‌యార్డు సమీపంలో గల విశాఖపట్నం కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్ (సీఎఫ్ఎస్) గోదాములో ఈ నెల తొమ్మిదో తేదీన మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీల సందర్భంగా సీజ్ చేసిన బియ్యం రేషన్ డిపోల నుంచి ... మిగతా 6వ పేజీలో

బడ్జెట్ లేకున్నా బడాయి!

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు

» నిధులు లేకపోయినా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

» నేటి స్టాండింగ్ కమిటీ సమావేశం ఎజెండాలో పొందుపరిచిన వైనం

» ఆయా పనులకు టెండర్లు పిలిస్తే బిల్లు చెల్లింపునకు ఇబ్బందే

» అదేమీ పట్టించుకోకుండా ముందుకువెళ్లడంపై సందేహాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నిధులు లేనప్పటికీ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారుచేసి స్టాండింగ్ కమిటీ ఎజెండాలో పెడుతున్నారు. ఆ పనులకు కమిటీ ఆమోదం తెలిపినా కాంట్రాక్టర్లకు బిల్లులు ఎలా చెల్లిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



జీవీఎంసీ ఏటా ఆర్థిక సంవత్సరం ఆరంభానికి ముందు బడ్జెట్‌ను తయారుచేస్తుంది. వచ్చే ఆదాయం ఎంత?, ఏ విభాగానికి ఎంత కేటాయిస్తున్నామనేది బడ్జెట్‌లో స్పష్టంగా పేర్కొంటుంది. బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా మాత్రమే పనులు ప్రతిపాదించడం, ఖర్చు చేయడం జరగాలి. ఒక విభాగానికి బడ్జెట్‌లో కేటాయించిన మేరకు నిధులు ముందుగానే ఖర్చు అయిపోతే...తర్వాత కొత్తగా పనులు ప్రతిపాదించడానికి అవకాశం ఉండదు. ఒకవేళ నిధులు అవసరం అనుకుంటే డిసెంబరు లేదా జనవరిలో చేపట్టే సవరణ బడ్జెట్‌లో ఇతర విభాగాల్లో మిగిలిన నిధులను కావాల్సిన విభాగానికి సర్దుబాటు చేసి, ఆ తర్వాత మాత్రమే పనులను ప్రతిపాదించేందుకు అవకాశం ఉంటుంది. కానీ శుక్రవారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో జోన్-7లోని 84వ వార్డులో రూ.30 లక్షలు వ్యయంతో కాలువ నిర్మించాలని ఎజెండాలో ప్రతిపాదించారు. దీనికి అవసరమైన నిధులను ఇంజనీరింగ్ విభాగానికి 2024-25 బడ్జెట్ నుంచి (కోడ్ 4120051 నంబర్) కేటాయిస్తున్నట్టు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. వాస్తవంగా ఆ కోడ్‌లో ప్రస్తుతం రూ.3.85 లక్షలు మాత్రమే ఉన్నాయి. అధికారులు ఆ విషయాన్ని విస్మరించి ఏకంగా రూ.30 లక్షలు వ్యయంతో కాలువ నిర్మించాలని ప్రతిపాదించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అలాగే అదే వార్డులో రూ.1.39 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు, సీసీ, ఆర్‌సీసీ కాలువలు నిర్మించేందుకు ఎజెండాలో ప్రతిపాదించారు. ఆ పనికి బడ్జెట్ కోడ్ 4120094 నుంచి నిధులు కేటాయిస్తున్నట్టు చూపించారు. కానీ వాస్తవంగా ఆ కోడ్‌లో ప్రస్తుతం రూ.6.7 లక్షలు మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ ఏకంగా రూ.1.39 కోట్లు ఆ కోడ్ నుంచి ఖర్చు చేయాలని ప్రతిపాదించడం విశేషం. ఆయా పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపితే ఇంజనీరింగ్ అధికారులు వెంటనే టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులుచేసే బాధ్యతను అప్పగించేస్తారు. ఆ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్‌కు అధికారులు బిల్లు ఎలా చెల్లిస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బడ్జెట్‌లో ఇతర ... మిగతా 6వ పేజీలో



నగరానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాక

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా రాడిసన్ హోటల్‌కు వెళ్లి బస చేశారు. శుక్రవారం పవన్ కల్యాణ్ పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వెళతారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో పర్యటిస్తారు.

హెల్మెట్ ధారణపై స్పెషల్ ఫోకస్

ఇప్పటికే ఎక్కడికక్కడ తనిఖీలు

» ఈ-చలాన్‌జారీతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్

» త్వరలో సిగ్నల్స్ వద్ద ఆటోమెటిక్ ఫేసియల్ రికగ్నైజేషన్ కెమెరాలు

» ఉల్లంఘనకు పాల్పడితే ఆటోమెటిక్‌గా ఈ-చలాన్ జారీ

» ఫిబ్రవరి నాటికి శతశాతం హెల్మెట్ ధారణ లక్ష్యంగా నగర పోలీస్ కమిషనర్ చర్యలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో వాహన చోదకులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చూడాల్సిందిగా అధికారులు, సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మరోమారు ఆదేశాలు జారీచేశారు. వచ్చే ఫిబ్రవరి నాటికి నగరంలో శతశాతం హెల్మెట్ ధరించేలా చూడాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు.



నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏటా సగటున 1,400 రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటిలో సగటున 350 మంది మరణిస్తే, మరో 1,300 మంది క్షతగాత్రులవుతున్నారు. సగానికిపైగా రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాల ప్రమేయం ఉంటోంది. మృతుల్లో సగానికిపైగా ద్విచక్ర వాహనదారులు, అందులోనూ 70 శాతం మంది హెల్మెట్ ధరించని వారు ఉంటున్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జూలైలో సీపీగా బాధ్యతలు చేపట్టిన శంఖబ్రత బాగ్చీ వాహన చోదకులంతా హెల్మెట్ ధరించేలా ఎక్కడికక్కడ తనిఖీలు చేయాలని ట్రాఫిక్‌తోపాటు శాంతి భద్రతల విభాగం పోలీసులను ఆదేశించారు. పట్టుబడిన వారికి జరిమానా విధించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలలు సస్పెండ్ చేయిస్తున్నారు. దీనివల్ల వాహన చోదకుల్లో కాస్త మార్పు వచ్చింది. గత ఏడాది జూలై-నవంబరు మధ్య జరిగిన రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్ల 46 మంది, ధరించినా 41 మంది మృతి చెందగా, ఈ ఏడాది జూలై-నవంబరు మధ్య జరిగిన రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్ల 42 మంది, ... మిగతా 6వ పేజీలో

హెల్మెట్ డ్రైవ్‌లో జూలై ఒకటి నుంచి డిసెంబరు 18 వరకు నమోదైన కేసులు

మొత్తం కేసులు	4,73,441
విధించిన జరిమానా	రూ.4,73,44,100
సస్పెండ్ చేసిన డ్రైవింగ్ లైసెన్స్‌లు	రూ.1,18,594



మార్గశిర మూడో గురువారం సందర్భంగా వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దర్శనానికి భక్తులు వెల్లువలా తరలివచ్చారు. అర్ధరాత్రి దాటిన తరువాత అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి, స్వర్ణాభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. - 6లో



పర్యాటక శాఖా మంత్రి దుర్గేశ్ రాక

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ గురువారం రాత్రి నగరానికి వచ్చారు. ప్రభుత్వ అతిథిగృహంలో బస చేశారు. ద్వారకా నగర్ పౌరగ్రంథాయలంలో శుక్రవారం జరగనున్న పరవస్తు చిన్నయసూరి జయంతి ఉత్సవంలో ఆయన పాల్గొంటారు. కార్యక్రమం ముగిసిన తరువాత మధ్యాహ్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో రాజమండ్రి వెళతారు.

మళ్లీ ఊయల

» ప్రభుత్వ ఆస్పత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్, తదితర చోట్ల ఏర్పాటు

» మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలు

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):



అవాంఛిత గర్భం దాల్చినవారు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవారు పుట్టిన పిల్లలను ముళ్ల పొదల్లో, కాలువల్లో పడేస్తుంటారు. ఈ తరహా చర్యల వల్ల నవజాత శిశువులు మృతిచెందు తున్నారు. అటువంటి మరణాలను నివారించేం దుకు 'ఊయల' పేరుతో ప్రభుత్వం గతంలో ఒక కార్యక్రమాన్ని అమలు చేసింది. అయితే, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో నిధులు విడుదల చేయకపో వడంతో 'ఊయల' ఊసే లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఊయల కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలంటూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది.

ఎక్కడెక్కడ ఏర్పాటుచేస్తారంటే...

పిల్లలను వద్దనుకునే తల్లిదండ్రులు ఎవరైనా నవజాత శిశువులను ఊయలలో వదిలి వెళ్లిపోవచ్చు. ఈ ఊయలలను ప్రభుత్వ ఆస్పత్రులు, జనాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. కేజీహెచ్, ఘోషా ఆస్పత్రులు, ఆర్టీసీ కాంప్లెక్స్ రైల్వే స్టేషన్, హెల్త్ సిటీ, ప్రైవేటు ఆస్పత్రులు ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. జిల్లాలో సుమారు ఇరవైచోట్ల ... మిగతా 6వ పేజీలో

4న నౌకాదళ విన్యాసాలు

» ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరు

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్

» 2న పూర్తిస్థాయి రిహార్సల్స్: తూర్పు నౌకాదళ అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

నగరంలో వచ్చే నెల నాలుగో తేదీన ఆర్కే బీచ్‌లో భారత నౌకాదళం విన్యాసాలు ప్రదర్శించనున్నదని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఏటా డిసెంబరు నాలుగో తేదీన విశాఖలో నేవీడే నిర్వహిస్తుంటారని, అయితే ఈ పర్యాయం ఆ కార్యక్రమం పూరీలో జరిగిందన్నారు. దానికి అనుబంధంగా జనవరి నాలుగో తేదీన విశాఖలో విన్యాసాలు ప్రదర్శించబోతున్నార న్నారు. ఈ కార్యక్రమం కోసం తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన వేదిక సమీపంలో సీఎం కోసం గ్రీన్ రూమ్ ఏర్పాటుచేయాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ... మిగతా 6వ పేజీలో



అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను బయటకు తీసి, భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి (108) పఠిస్తూ ప్రతి నామానికి సిరి సంపెంగలతో పూజలు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారికి ఆర్జిత నిత్య కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

'అమిత్‌షా రాజీనామా చేయాలి'

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ అంబేడ్కర్, దళిత నాయకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఉత్తరాంధ్ర మాలమహానాడు అధ్యక్షుడు పతివాడ రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ మతోన్మాద పాలనలో దేశంలోని మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని విమర్శించారు.

ద్రోణంరాజుకు నివాళి

మధురవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ ద్రోణంరాజు సత్యనారాయణ జయంతి సందర్భంగా వైసీపీ నాయకులు ఏడో వార్డు కృష్ణానగర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి గురువారం పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, పిళ్లా సూరిబాబు, కృష్ణమూర్తిపాత్రుడు, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

'నాయీ బ్రాహ్మణులపై కేసులు సరికాదు'

సింహాచలం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పలు ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులపై అక్రమంగా బనాయించిన కేసులను కొట్టి వేయాలని సింహాచలం దేవస్థానం నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జి.రాము డిమాండ్ చేశారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని పలు ఆలయాల్లో పని చేస్తున్న నాయీబ్రాహ్మణులు అవినీతికి పాల్పడుతున్నట్టు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

రెవెన్యూ సదస్సుకు 11 అర్జీలు

పద్మనాభం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నేరేళ్లవలసలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 16 వినతులు వచ్చాయి. వీటిలో మ్యుటేషన్ కోసం 11, ధ్రువీకరణ పత్రాల కోసం 5 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ రామకృష్ణ, టీడీపీ నాయకుడు పైల శ్రీను, వీఆర్వో స్వామి పాల్గొన్నారు.

పద్మనాభంలో నగర సంకీర్తన

పద్మనాభం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంతుని క్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు భక్తిప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం వేకువజామున గోదాదేవి, వేణుగోపాలస్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీలో ఊరేగించారు. అలాగే నగర సంకీర్తన చేపట్టారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ఎండాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. మధురవాడ నగరపాలెంనకు చెందిన తాతబాబు బైక్‌పై స్వతంత్రనగర్ వైపు వెళుతుండగా నగరంపాలెం మలుపు వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొనడంతో గాయపడ్డాడు. అలానే విజయనగరానికి చెందిన చైతన్య వంశీ మధురవాడ ఐటీ సెజ్ ప్రాంతంలోని కాఫీ షాపు వద్ద ఫోన్‌లో మాట్లాడుతుండగా ద్విచక్ర వాహనదారుడు వచ్చి ఢీకొన్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

నేవీ ఉద్యోగి ఆత్మహత్య

మహారాణిపేట (విశాఖపట్నం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాన్వెంట్ జంక్షన్‌లో గల ఒక హోటల్‌లో నేవీ ఉద్యోగి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తమిళనాడుకు చెందిన ఆర్. రంజిత్ కుమార్ (23) విశాఖలో నౌకాదళంలో పని చేస్తున్నాడు.అతను కొన్ని రోజులుగా సెలవులో ఉన్నాడు. ఈనెల 14న తమిళనాడు నుంచి నగరానికి వచ్చి కాన్వెంట్ జంక్షన్‌లోని ఒక హోటల్‌లో దిగాడు. బుధవారం అతను రూమ్ నుంచి బయటకు రాకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వెళ్లి రూమ్ తెరచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి ఫోన్‌లో ఉన్న నంబర్లు ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు, నేవీ అధికారులకు సమాచారం అందజేశారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని గ్రామాల్లోనూ రక్షిత మంచినీటి పథకాలు

- పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ కృష్ణతేజ
- బోని గ్రామంలో పర్యటన
- అధికారులకు పలు సూచనలు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేస్తామని, అందుకు అవసరమైన ప్రణాళికను రూపొందిస్తున్నామని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం. కృష్ణతేజ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన బోని గ్రామంలో రక్షిత మంచి నీటి పథకాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సురక్షితమైన నీరు అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పంపు హౌస్, క్లోరినేషన్ పవర్ సప్లయి స్కీమ్‌లను పరిశీలించారు. ఈ పథకం ద్వారా ఆనందపురం మండలంలో 17 పంచాయతీలకు తాగునీరు సరఫరా చేస్తున్నామని అధికారులు ఆయనకు వివరించారు. 2004లో ప్రారంభించిన ఈ పథకం పనితీరు మాదిరిగా అన్ని ప్రాంతాల్లోనూ రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ టి. నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



బోనిలో మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న పీఆర్ కమిషనర్ కృష్ణతేజ

సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీలకు గీతం విద్యార్థులు

సాగర్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో ఏఐయూ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి దక్షిణాది యూనివర్సిటీల మధ్య జరగనున్న సౌత్ జోన్ ఫుట్‌బాల్ (పురుషుల) పోటీలకు గీతం వర్సిటీ జట్టు ఎంపికైనట్టు వర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు. విజయకుమార్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జట్టు మేనేజర్‌గా జియాద్, కోచ్‌గా ఎం. రాజ్‌కుమార్ వ్యవహరిస్తారని చెప్పారు.

పాఠశాలకు ప్రముఖుల చిత్రపటాలు బహూకరణ



హెచ్‌ఎంకు చిత్రపటాలను బహూకరిస్తున్న శివాజీ, తదితరులు

మధురవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు సునీల్ శర్మ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ తన సొంత డబ్బులతో ప్రముఖుల చిత్రపటాలను గురువారం బహూకరించారు. ఇటీవల ఈ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ పాఠశాలలో ప్రోటోకాల్ ప్రకారం చిత్రపటాలు లేవని గుర్తించి, వాటిని ఇవ్వాలని శివాజీని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖా మంత్రి లోకేశ్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటాలను పాఠశాల హెచ్‌ఎంకు అందించారు.

భీమిలి తీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు



మంగమారిపేట తీరానికి కొట్టుకువచ్చిన తాబేళ్ల కళేబరాలు

భీమునిపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సముద్ర తీరానికి ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు కొట్టుకువస్తున్నాయి. రెండు రోజుల్లో భీమిలి నుంచి మంగమారిపేట వరకూ వున్న తీరంలో 12కు పైగా తాబేళ్ల కళేబరాలు కొట్టుకువచ్చాయి. భీమిలి తీరంలో అయిదు, ఉప్పాడ, మంగమారిపేట తీరాల్లో మిగిలిన తాబేళ్ల కళేబరాలు ఉన్నాయి. వీటిని జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు తీరంలో పూడ్చివేశారు.

అప్పన్న సన్నిధిలో వైభవంగా ధనుర్మాసోత్సవాలు



సింహాచలం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం వేకువజామున సుప్రభాతసేవ, సేవాకాలం,ధూపసేవ, నిత్యహోమం, బాలభోగం, రాజభోగం నివేదన తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవి అమ్మవారిగా అలంకరించారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేద మంత్రోచ్చారణలు నడుమ బేడా మండపంలో తిరువీధి ఉత్స వం జరిపారు. తిరువీధిలో అష్టదిక్పాలకులకు పూజలు చేశారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో ఆలయ స్థానాచార్యులు డాక్టర్ టి. రాజగోపాల్ పర్యవేక్షణలో గోదాదేవి రచించిన తిరుప్పావైలోని నాల్గవ పాశురం విన్నపం చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై కళాజాత

భీమునిపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మునిసిపల్ లాల్‌బహదూర్‌శాస్త్రి మార్కెట్‌లో గురువారం కళాజాత ప్రదర్శించారు. ప్రజలు విద్యుత్‌ను ఏవిధంగా పొదుపు చేయాలో బుర్రకథ రూపంలో వివరించారు. అలాగే ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విశాఖ జోన్ -3 ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ ఈఈ పి. శ్రీనివాసరావు, భీమిలి సబ్ డివిజన్ డెప్యూటీ ఈఈ ఆర్.రమేశ్, ఏఈ యు. సకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ శాస్త్రవేత్త ప్రదీప్‌కు సన్మానం



శాస్త్రవేత్త ప్రదీప్‌ను సన్మానిస్తున్న ఆచార్యులు

సాగర్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఐఐటీ చెన్నై సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ టి. ప్రదీప్ గురువారం గీతం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్. కృష్ణ, తదితరులు ప్రదీప్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీటి జలాలు అందించడానికి తాను రూపొందించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం గురించి పరిశోధకులకు వివరించారు. అనంతరం స్కూల్ ఆఫ్ సైన్స్ పరిశోధకులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరన్ దాస్, గీతం విశిష్ట ప్రొఫెసర్ బీవీఆర్ టాటా, గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీఆర్ శర్మ, తదితర్లు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కొవ్వొత్తులను వెలిగిస్తున్న నూకరాజు, తదితరులు

భీమునిపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్‌రోడ్‌లో జీసస్ పార్క్ వద్ద పట్టణ వైఎంసీఏ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వైఎంసీఏ విశాఖ సబ్ రీజనల్ వైస్ ఛైర్మన్ సుధాకర్ అధ్యక్షతన ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ వి. స్టీవెన్ మాట్లాడుతూ క్రిస్మస్ దైవ సందేశాన్ని అందించారు. ప్రేమ, కరుణ అందించడానికే లోక రక్షకుడు యేసు ఈ లోకంలో జన్మించారని, ఆయన జీవితం ఆదర్శనీయమని కొనియాడారు. అనంతరం పలువురు మాట్లాడుతూ జీసస్ పార్క్‌ను జీవీ ఎంసీ నిధులతో కొత్తగా తీర్చిదిద్దినందుకు జోనల్ కమిషనర్ ప్రసన్న జ్యోతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో భీమిలి, తగరపువలస ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి సంఘాల అధ్యక్షులు వై. లివింగ్ స్టన్, గండి జాన్ ప్రకాశ్ భీమిలి సంఘం సెక్రటరీ జె. ఆల్బర్ట్ సుదర్శన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పాస్టర్లు విజయ్ కుమార్, సునీతబాలు, ప్రభాకర్, రాజ్‌కుమార్, కృపారావు, జాకబ్, వైఎంసీఏ ప్రతినిధులు విలియం కేరీ, స్టీవెన్, వైఎంజె కుమార్, జోసఫ్ జేమ్స్, యేసుదాసు, ప్రేమానందం పాల్గొన్నారు.

అవంతిలో ఫార్మసీ విద్యార్థుల 'ఇండక్షన్ మీట్'

తగరపువలస, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఇండక్షన్ మీట్ ఘనంగా జరిగింది. ఆ విద్యా సంస్థలకు చెందిన బి. ఫార్మసీ, ఎం. ఫార్మసీ డి. ఫార్మసీ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డా. ఎంవీ రాజు ఆధ్వర్యంలో కళాశాల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫార్మ సిటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా జి. గిరిజా శంకర్, ఎన్ఆర్ఐ మెడికల్ సైన్సెస్ డీన్ డా.పి.వి. సుధాకర్, అవంతి ఫార్మా కళాశాలల వైస్ ప్రిన్సిపాల్ వి. ఉమాశంకర్, శాఖాధిపతులు ఎం. పావని, బి. మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో కూలిన ట్రీ వాల్



సాగర్‌నగర్ వద్ద బీచ్ రోడ్డుపై పడిన ట్రీ వాల్

సాగర్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ కల్వర్టుపై ఏర్పాటు చేసిన ట్రీ వాల్ గురువారం నేలకొరిగింది. ఆ సమయంలో అటువైపుగా ఎవరూ ప్రయాణించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నగర సుందరీకరణ పనుల్లో భాగంగా గత ప్రభుత్వం మురుగు కాలువల కల్వర్టులపై ట్రీ వాల్స్ ఏర్పాటు చేసింది. అప్పట్లో వీటిపై పలు ఆరోపణలు వచ్చాయి. నాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తమయ్యాయి. అది ఇపుడు నిజమవుతోంది. తీర ప్రాంతాల్లో ఇనుముతో తయారు చేసినవి ఎక్కువ కాలం ఉండవని తెలిసినప్పటికీ అధి కారులు లక్షలాది రూపాయలు వెచ్చించి, వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇవి అక్కడక్కడ నేలకొరుగుతున్నాయి.

హెల్మెట్ ధారణపై స్పెషల్ ఫోకస్

... 5వ పేజీ తరువాయి

హెల్మెట్ ఉన్నప్పటికీ మరణించిన వారి సంఖ్య 30కి తగ్గింది.

హైకోర్టు ఆదేశాలతో తనిఖీలు మరింత ముమ్మరం:

రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని కారణంగా మూడు నెలల్లోనే 688 మంది మరణించడంపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. వాహన చోదకులు హెల్మెట్ ధరించేలా కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో నగరంలో తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జూలై నుంచి డిసెంబరు 18 వరకూ హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న 4,73,441 మందిపై కేసులు నమోదుచేసి వారి నుంచి రూ.4,73,44,100 వసూలుచేసేలా ఈ-చలాన్‌లు జారీచేశారు. పట్టుబడిన వారిలో 1,18,594 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు.

చాలావరకూ మార్పు కనిపిస్తుంది

సీపీ శంఖబ్రతబాగ్చి

నగరంలో హెల్మెట్ ధారణపై విస్తృతంగా అవగాహన కల్పించడం, ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ జరిమానాలు విధించడం, లైసెన్స్‌లు సస్పెన్షన్ చేయడంతో చాలా వరకు మార్పు కనిపిస్తోంది. నేను సీపీగా బాధ్యతలు తీసుకున్నప్పుడు నగరంలో 20 శాతం హెల్మెట్ ధారణ ఉంటే ఇప్పుడు 50 శాతానికి పెరిగింది. వచ్చే ఫిబ్రవరి నాటికి శతశాతం చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం. పోలీసులను చూసి కొంతమంది హెల్మెట్ పెట్టుకుంటున్నారు. దాటగానే హెల్మెట్ తీసి మళ్లీ పక్కన పెడుతున్నారు. అలాంటి వారికి చెక్ పెట్టడానికి తగరపువలస నుంచి కూర్మన్నపాలెం వరకు ఉన్న సిగ్నల్స్‌తోపాటు నగరంలోని అన్ని సిగ్నల్స్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ కలిగిన ఆటోమెటిక్ ఫేసియల్ రికగ్నిజేషన్ కెమెరాలు ఏర్పాటుచేయబోతున్నాం. ఈ నెలాఖరుకు డీపీఆర్ ఖరారైపోతుంది కాబట్టి జనవరి చివరి నాటికి ఈ సదుపాయం అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల ట్రిపుల్ రైడింగ్ చేసినా, హెల్మెట్ ధరించకపోయినా, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా, సిగ్నల్ జంపింగ్ చేసినా ఆటోమెటిక్‌గా ఫొటోతో ఈ-చలాన్ జారీ అయిపోతుంది. ఆ సమాచారంతోపాటు వాహనం నడిపేవారి ముఖం ఫొటో కూడా తీయడం వల్ల వారి వివరాలన్నీ పోలీస్ శాఖతోపాటు రవాణా శాఖకు చేరతాయి. దాంతో వాహనం నడిపేవారి డ్రైవింగ్ లైసెన్స్ ఆటోమేటిక్‌గా సస్పెండ్ అయిపోతుంది. ఒక వేళ డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు అయితే వాహనం యజమానికి భారీ జరిమానాతో ఈ-చలాన్ చేరుతుంది. దీనివల్ల తప్పనిసరిగా అందరూ ట్రాఫిక్ నిబంధనలతోపాటు రహదారి భద్రతను పాటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

బడ్జెట్ లేకున్నా బడాయి!

... 5వ పేజీ తరువాయి

విభాగాలకు కేటాయించిన నిధులు మిగిలి ఉంటే వాటిని సర్దుబాటు చేస్తే తప్ప కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లింపు సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ఆ విషయాన్ని ఇంజనీరింగ్ విభాగం అధికారులు గుర్తించకుండా పనులకు ప్రతిపాదించడం చర్చనీయాంశమైంది.

కాగా జీవీఎంసీ పరిధిలో రూ.50 లక్షలకు పైబడిన పనులు చేపట్టేందుకు, బిల్లుల చెల్లింపునకు కచ్చితంగా కౌన్సిల్‌లో చర్చించి ఆమోదించాలి. రూ.50 లక్షలు కంటే తక్కువ విలువైన పనులకు సంబంధించిన నిర్ణయాలు మాత్రమే స్టాండింగ్ కమిటీ తీసుకోవడానికి అధికారం ఉంటుంది. 84వ వార్డులో సీసీ రోడ్లు, ఆర్‌సీసీ కాలువలు నిర్మాణం కోసం రూ.1.39 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు వేసినందున ఆ అంశాన్ని కచ్చితంగా కౌన్సిల్ సమావేశంలో పెట్టాలి. వారం కిందటే కౌన్సిల్ సమావేశం జరిగింది. కానీ, అక్కడ ఆ అంశాన్ని అధికారులు పొందుపరచకుండా, మూడు ముక్కలుగా విభజించి ఒక్కొక్క పని విలువ రూ.50 లక్షల లోపునకు తగ్గించి వేర్వేరు అంశాలుగా స్టాండింగ్ కమిటీ ఎజెండాలో పొందుపరచడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మళ్లీ ఊయల

... 5వ పేజీ తరువాయి

ఊయలలు ఏర్పాటుచేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ఊయల పర్యవేక్షణ బాధ్యతను స్థానిక ఏఎన్ఎంకు అప్పగిస్తారు. ఊయల వద్ద బెల్ ఏర్పాటుచేస్తారు. ఎవరైనా బిడ్డను వదిలి వెళుతుంటే బెల్ కొట్టాల్సి ఉంటుంది. అయితే, దానివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని అధికారులు చెబుతున్నారు. బిడ్డను వద్దనుకుని వెళ్లివాళ్లు బెల్ ఎందుకు కొడతారని ప్రశ్నిస్తున్నారు.

శిశువులు దత్తత

ఊయలలో వేసే చిన్నారులకు సంబంధించిన వివరాలతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఒక ప్రకటన ఇస్తారు. అందులో పేర్కొన్న వ్యవధిలోగా ఎవరైనా రాకపోతే శిశువులను బాల సదనాల్లో అప్పగిస్తారు. అనంతరం పిల్లలు కావాలనుకునే వారికి అధికారికంగా దత్తత ఇస్తారు.

4న నౌకాదళ విన్యాసాలు

... 5వ పేజీ తరువాయి

పర్యటించి ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. తూర్పు నౌకాదళానికి చెందిన అధికారి ఒకరు మాట్లాడుతూ 4తేదీ సాయంత్రం బీచ్‌లో ఓపీ డెమో జరుగుతుందని, లేజర్‌షో, డ్రోన్‌షో, నౌకల పైనుంచి విన్యాసాలు ఉంటాయన్నారు. జనవరి రెండో తేదీన పూర్తిస్థాయి రిహార్సల్స్ జరుగుతాయన్నారు. నేవీ తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం పూర్తిగా సహకరించాలని కోరారు. సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ అజిత వేజెండ్ల, నేవీ అధికారులు వైకే కిషోర్‌కుమార్, సంజీవ్‌శరణ్, ఉజైర్ కుస్రో, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోడౌన్ సూపర్‌వైజర్లు అరెస్టు

... 5వ పేజీ తరువాయి

సేకరించినవేనని తేలడంతో మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గోడౌన్ సూపర్‌వైజర్‌లుగా ఉన్న బుజ్జి, సుధాకర్ అనేవారిని బుధవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. అయితే రిమాండ్‌కు న్యాయస్థానం నిరాకరించడంతో గురువారం స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఈ కేసులో దాదాపు 11 కంటెయినర్‌లను పోలీసులు సీజ్ చేశారు. కార్డుదారుల నుంచి వేర్వేరు మార్గాల్లో సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రదేశంలో ప్యాకింగ్ చేసి రాత్రి సమయంలో గోదాములకు తరలించి, అక్కడి నుంచి నౌకల ద్వారా విదేశాలకు పంపుతున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసును మల్కాపురం సీఐ ఎస్.విద్యసాగర్ ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ ఎస్ఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు



కలువ పువ్వుల అలంకరణలో అమ్మవారు

కనకమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

- మూడో వారమూ తగ్గని తాకిడి
- కిటకిటలాడిన క్యూ లైన్లు
- బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రాత్రి వరకూ రద్దీ

జగదాంబ కూడలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మూడో గురువారం కూడా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రాత్రి వరకూ ఒకే విధమైన రద్దీ కొనసాగింది. రూ. 500, రూ. 200, రూ. 100 దర్శనాల క్యూలు ప్రధాన ఆలయం నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు నిండిపోయాయి. ఆలయ ఆవరణలో ఎక్కడ చూసినా భక్తజన సందడి నెలకొంది. నగరం నలుమూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కూడా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారి నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వీఐపీలు, వీవీఐపీలతో సంబంధం లేకుండా సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాల కోసం సిఫార్సు లేఖలతో వచ్చిన వారు పీఆర్‌ఓ కార్యాలయం వద్ద బారులు తీరారు. ఉత్సవాల్లో భాగంగా 3 నుంచి 5 గంటల మధ్య ఈ దర్శనాలకు అవకాశం కల్పించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధుల లేఖలతో వచ్చిన వారికి విక్టోరియా ఆసుపత్రి వద్ద వీఐపీ, వీవీఐపీ దర్శనాలకు క్యూ లైన్ ఏర్పాటు చేశారు. అడ్డగోలు దర్శనాలకు బ్రేక్ వేసేందుకు పోలీసులు, దేవస్థానం అధికారులు పకడ్బందీగా వ్యవహరించారు. వన్ టౌన్ సీఐ దేముడుబాబు ఆలయ ఆవరణలో తిరుగుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అధికారులు క్యూలైన్లలో ఉన్న వారికి తాగునీరు, మజ్జిగ, పిల్లలకు బిస్కెట్లు అందజేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేప ట్టారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో శోభారాణి, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

ఎస్.రాయవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా ఎస్.రాయ వరం మండలంలోని ఒక గ్రామంలో మతిస్థిమితం లేని యువతి (20)పై కె.నాగరాజు (43) అత్యాచారానికి పాల్పడినట్టు గురువారం ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం...మతి స్థిమితం లేని యువతి ఒంట రిగా నడిచి వెళుతుండడం గమనించి అదే గ్రామానికి చెందిన నాగరాజు తన ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నాగరాజును అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నెలాఖరులో 'అరకు ఉత్సవ్'

పాడేరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'అరకు ఉత్సవ్'ను ఈ నెలాఖరులో నిర్వహించనున్నామని, ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. 'ఉత్సవ్' ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటకులను అలరించేలా అరకు ఉత్సవ్‌ను నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పట్టణం మరింత సుందరంగా కనిపించేలా విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. వివిధ రకాల స్టాళ్లను పెట్టాలని, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మారథాన్, చిత్రలేఖనం, రంగోలి, కార్నివాల్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అలాగే గులాబీల ప్రదర్శన, హాట్ ఎయిర్ బెలూన్, కాఫీ రుచుల పోటీలు, గిరిజన కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు.



అల తాకిడి నుంచి బయటపడిన పర్యాటకులు

విరుచుకుపడిన కెరటం

సాగర్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో గురువారం మధ్యాహ్నం పర్యాటకులు సముద్ర స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద కెర టం విరుసుకుపడింది. దీంతో వారంతా భయంతో పరుగు తీశారు. బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల సముద్రం అల్లకల్లోలంగా ఉంది. తీరం కోతకు గురవుతుండడంతో పాటు కెరటాలు ఎగసిపడుతున్నాయి. వాతావరణం అనుకూలంగా లేనప్పటికీ పర్యాటకులు సముద్ర స్నానాలకు అత్యుత్సాహం చూపుతున్నారు. మెరైన్ పోలీసులు, లైఫ్ గార్డులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేస్తున్నా..పెడచెవిన పెడుతున్నారు. ప్రస్తుతం అలలు సాధారణం కంటే ఎక్కువ ఎత్తులో ఎగసి పడుతున్నాయి. ఈ సమయంలో సముద్ర స్నానాలకు దిగడం శ్రేయస్కరం కాదని అధికారులు సూచిస్తున్నారు.

సచివాలయాల్లో జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

- మెరుగైన సేవలు అందించాలని ఆదేశం
- పనితీరు, పన్నుల వసూళ్లపై ఆరా
- సిబ్బందికి పలు సూచనలు
- అన్నక్యాంటీన్ల పనితీరు పరిశీలన


పన్నుల వసూళ్ల గురించి ఆరా తీస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ వార్డు కార్యదర్శులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన 3వ జోన్‌లోని ఆర్కే బీచ్‌లో రామకృష్ణ మిషన్ లైబ్రరీ వద్ద ఉన్న 21086164, 21086165, 21086166 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సచివాలయంలో కార్యదర్శుల విధులు, హాజరు, డైరీ తదితరాలను పరిశీలించారు. సచివాలయ పరిధిలో ఎన్ని నూతన నిర్మాణాలు, అనధికార కట్టడాలు ఎన్నింటిని గుర్తించారని డబ్ల్యుపీఆర్ఎస్ కార్యదర్శులను ఆరా తీరారు. 21086165 సచివాలయంలో ఆస్తి, తాగు నీటి పన్నులు ఇప్పటి వరకు ఎంత వసూలు చేశారని వాకబు చేశారు. 21086166 సచివాలయంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం వచ్చిన వారితో మాట్లాడుతూ మీకు ఎన్ని రోజుల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ అందిందని అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలకు రోజుకు ఎన్ని అర్జీలు వస్తున్నాయని, ప్రజలు పొందే సేవలు వాటి వివరాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. సచివాలయాలకు ప్రజలు తక్కువగా వస్తున్నందున ఖాళీ సమయంలో జీవీఎంసీ చేపడుతున్న శానిటేషన్, ఆస్తి పన్ను వసూలు, ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాలు విభజన, సేంద్రీయ ఎరువు తయారీ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆదేశించారు. ప్రజలకు అందించే సేవల గురించి తెలిపే బోర్డులను సచివాలయాల బయట ప్రదర్శించాలని కార్యదర్శులను సూచించారు. సచివాలయాల సమీపంలో పరిశుభ్రతను నిత్యం పాటించాలన్నారు. మహిళా పోలీస్ కార్యదర్శుల విధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాల సమీపంలోనున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించి, అన్న క్యాంటీన్‌లో భోజనం నాణ్యత, పరిశుభ్రత, మంచి నీటి సరఫరా తదితర వాటిని పరిశీలించారు. భోజనానికి వచ్చిన వారితో మాట్లాడి భోజనాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్లలో పరిశుభ్రతతో కూడిన రుచికరమైన భోజనం ప్రజలకు అందించాలని అన్న క్యాంటీన్ ఆహార సరఫరా నిర్వాహకులను ఆదేశించారు. ఈ పర్యటనలో 3వ జోనల్ కమిషనరు కె.శివప్రసాద్, రెవెన్యూ అధికారి డేవిడ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర రాజకీయ దురంధరుడు ద్రోణంరాజు


ద్రోణంరాజుకు నివాళులు అర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, శ్రీవత్సవ, రమణికుమారి, జహీర్ అహ్మద్ తదితరులు

సిరిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రలోని రాజకీయ దురంధరుడు స్వర్గీయ ద్రోణంరాజు సత్యనారాయణ అని పలువురు వక్తలు కొనియాడారు. ద్రోణంరాజు 92వ జయంతి సందర్భంగా గురువారం సిరిపురంలోని ద్రోణంరాజు సర్కిల్ వద్ద ఆయన మనవడు, వైసీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ఆధ్వర్యంలో పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. విశాఖ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తిరెడ్డి తదితరులు హాజరై ద్రోణంరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ద్రోణంరాజు సత్యనారాయణ ఎందరో నేతలను అందించిన రాజకీయ యూనివర్సిటీగా పేర్కొన్నారు.ఆయన రాజకీయ శిష్యులెందరో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా పదవులు పొందారన్నారు. ఆయన కుమారుడు స్వర్గీయ ద్రోణంరాజు శ్రీనివాస్ ఒక నిబద్ధత కలిగిన నాయకుడిగా ఎదిగారన్నారు. ఆయన మనమడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ సైతం అదే నిబద్ధతతో పయనిస్తున్నారన్నారు. శ్రీవత్సవ్ మాట్లాడుతూ తాత, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ మచ్చలేని నాయకుడిగా ప్రజలకు సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు కోడూరి అప్పలరత్నం, బిపిన్‌కుమార్ జైన్, ఊరుకుటి చందు, మాజీ వుడా చైర్మన్ రవి, డాక్టర్ జహీర్ అహ్మద్, బెహర భాస్కరరావు, రవిరెడ్డి, పేడాడ రమణికుమారి తిప్పల దేవన్‌రెడ్డి, జాన్‌వెస్లీ పెద్ద సంఖ్యలోఅభిమానులు హాజరై నివాళులుఅర్పించారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : ఏయూ వీసీ

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యువతరం పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. గురువారం ఏయూ కాన్వొకేషన్ హాలులో నిర్వహించిన ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీలో ఉన్న కాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు వేదికగా విశ్వవిద్యాలయ వ్యవస్థ నిలుస్తుందన్నారు. వర్సిటీ వనరులు, వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా జ్ఞానాన్ని సంపాదించడం ప్రధానమని చెప్పారు. నిపుణులైన ఆచార్యుల మార్గదర్శకాన్ని స్వీకరించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక ఏయూలో ఉన్నత విద్యను అభ్యసించడం, ఇక్కడ నేర్చుకున్న పాఠాలను నిత్యజీవితంలో కార్యరూపంలో చూపుతూ కార్యసాధకులుగా మారాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో మెగా జాబ్ మేళా రేపు

మద్దిలపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు. జేకేసీ, సూర్య ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో జరిగే మేళాలో టాటా గ్రూప్, జెన్‌పాక్ట్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, అరబిందో, హోండా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, పేటీఎం, ఎస్‌బ్యాంక్, ఐడీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, అపోలో తదితర సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. నిరుద్యోగులు బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలతో కళాశాలలో ఉదయం 9.30 గంటలకు హాజరై రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

వాయు కాలుష్య నియంత్రణకు కార్యాచరణ

- ఆర్తా గ్లోబల్ సంస్థతో కలిసి జీవీఎంసీ ప్రణాళిక
- ఏడీసీ రమణమూర్తి


మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రమణమూర్తి

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో వాయు కాలుష్య నియంత్రణకు ఆర్తా గ్లోబల్ సంస్థతో కలిసి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు శివప్రసాద్ రాజు అధ్యక్షతన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో వాయు కాలుష్య నియంత్రణ కోసం జీవీఎంసీ, ఆర్తా గ్లోబల్ సంస్థ సంయుక్తంగా వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీ రమణమూర్తి మాట్లాడుతూ నగరంలో పెరిగిపోతున్న దృశ్య కాలుష్య నియంత్రణకు ఆర్తా గ్లోబల్ సంస్థ, జీవీఎంసీ సంయుక్తంగా కృషి చేస్తుందని.. ముఖ్యంగా విశాఖ నగరాన్ని క్లీన్ హెయిర్ జోన్స్‌గా నిలిపేందుకు కార్యచరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ప్రాంతంలో కాలుష్య నియంత్రణకు ఏ విధంగా చర్యలు చేపట్టాలనే అంశంపై పలు సలహాలు, సూచనలు ఏయూ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథారిటీ, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తదితర వారితో చర్చించి చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపడతామని తెలిపారు. అనంతరం డిజిటల్ ట్రాన్స్ ఫార్మేషన్ అంశంపై శిక్షణ కార్యక్రమాలను జీవీఎంసీ అధికారులు, ఏయూ విద్యార్థులకు ఆర్తా గ్లోబల్, ఈ-గవర్నమెంట్ ఫౌండేషన్ ప్రతినిధులు నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం అదనపు కమిషనరు ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాదరాజు క్లీన్ ఎయిర్, ట్రాఫిక్ నియంత్రణ, కాలుష్యం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, బాలప్రసాద్, డీటీవో ఆదినారాయణ, ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రతినిధులు తెరి ప్రతినిధులు డాక్టర్ అంజాగోయిల్, శివాని, ఈగవర్నర్ ఫౌండేషన్ అమేయ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ఎస్కేఎల్‌ఎం నగర్‌లో వెలిసిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి గురువారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మూడో మార్గశిర గురువారం కావడంతో వేకువ జాము నుంచి వచ్చి అమ్మవారిని దర్శనానికి క్యూ కట్టారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో దర్శనానికి సుమారు గంట వరకు వేచి ఉండవలసి వచ్చింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారికి స్వయంగా క్షీరాభిషేకాలు, పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు.

ఏయూ న్యాయ కళాశాల హాస్టల్‌కు మంచాలు వితరణ


దాతలను సత్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల విద్యార్థుల హాస్టల్‌కి రాజమండ్రికి చెందిన జక్కంపూడి సరోజలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు జక్కంపూడి రాహుల్ దత్త, శ్రావ్యలు 30 మంచాలు, దుప్పట్లను వితరణ చేశారు. సుమారు రూ.1.5 లక్షలతో కొనుగోలు చేసి వీటిని విద్యార్థులకు ఉపయుక్తంగా తయారు చేయించి గురువారం న్యాయ కళాశాల హాస్టల్‌లో అందజేశారు. అనంతరం వీరు ఏయూ వీసీ జి.శశిభూషణరావుతో సమావేశం అయ్యారు. న్యాయ కళాశాల విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే మంచాలను హాస్టలుకు బహూకరించడం పట్ల వీసీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున దాతలను సత్కరించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం, న్యాయ కళాశాల హాస్టల్ చీఫ్ వార్డెన్ ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే వినియోగదారుల హక్కుల సాధన


ప్రసంగిస్తున్న బేగం

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అవగాహనతోనే వినియోగదారుల హక్కుల సాధన సాధ్యపడుతుందని జిల్లా వినియోగదారుల వివాదాలు పరిష్కార కమిషన్ సభ్యురాలు రహిమున్నీసా బేగం పేర్కొన్నారు. ఏయూలోని సోషల్ వర్క్ విభాగంలో గురువారం వినియోగదారుల హక్కులపై ప్రత్యేక ప్రసంగం నిర్వహించారు. వినియోగదారుల హక్కులపై రహిమున్నీషా బేగం ప్రత్యేక ప్రసంగం చేశారు. పోటీ ప్రపంచంలో వినియోగదారులను కార్పొరేటు సంస్థలు అనేక విధాలుగా మోసం చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థి స్థాయి నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహన ఎంతో ముఖ్యం అన్నారు. సోషల్ వర్క్ విభాగం విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.హరనాథ్, డాక్టర్ కోమల్ సలోమి, పుష్పలత, వేసవిల, ఆశాకిరణ్, శ్యామ్, శిరీష, అమిత, సూరిబాబు, లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సంక్షేమ భవనం కోసం భూమి కేటాయించాలి


వీఎంఆర్డీఏ చైర్మన్‌తో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సిరిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖలోని సీనియర్ సిటిజన్ల కోసం సంక్షేమ సముదాయానికి భూమి కేటాయించాలని విశాఖపట్నం జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్‌ను కలిసి కోరారు. సిరిపురం వీఎంఆర్డీఏలోని ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ వీడీఎస్‌సీడబ్ల్యుఏ మొత్తం 12 వేల కంటే ఎక్కువ మంది సభ్యులను కలిగి ఉందన్నారు. ఇది 18 సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ సమాఖ్య అన్నారు.సంఘం సభ్యులు సమావేశాలు, ఇతర కార్యక్రమాలు చేపట్టేందుకు సంక్షేమ సముదాయానికి భూమి కేటాయించాలని కోరారు. దీనిపై వీఎంఆర్డీఏ చైర్మన్ స్పందిస్తూ సాధ్యమైనంత మేరకు భూమి కేటాయింపులో సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తానని చెప్పారు.

బుచ్చిరాజుపాలెంలో రెండు ఇళ్లల్లో చోరీ

10 తులాల బంగారం, రూ. లక్ష నగదు అపహరణ



మర్రిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎయిర్ పోర్ట్ పోలీసు స్టేషన్ పరిధిలోని బుచ్చిరాజుపాలెం గవర వీధిలో బుధవారం చోరీ జరిగింది. వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. గవరవీధి రామాలయం సమీ పంలో ఉన్న అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తులో గిడిజాల అప్పలనాయుడు లక్ష్మీ దంప తులు నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె ఓణీ ఫంక్షన్ నిమిత్తం ఆదివారం వారు పద్మనాభం మండలం విజయరాంపురం వెళ్లారు. అదే అపార్ట్‌మెంట్ కింద పోర్షన్‌లో ఉంటున్న మహిళ దుస్తులు ఆరబెట్టేందుకు గురువారం ఉదయం అటువైపుగా వెళ్లగా అప్పలనాయుడు ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించింది. ఇంట్లో ఎవరూ ఉన్న అలికిడి లేకపోవడంతో బాధితులకు ఫోన్ చేసి, విషయాన్ని తెలిపారు. వెంటనే ఇంటికి వచ్చిన అప్పలనాయుడు చోరీ జరిగినట్టు గుర్తించి ఎయిర్ పోర్ట్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. జోన్-2 ఏసీపీ లక్ష్మణరావు, ఎయిర్ పోర్ట్ క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సుదర్శన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుల నుంచి వివరాలు సేకరిం చారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. అర్ధరాత్రి తరువాత దొంగలు తలుపులు విరగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, రూ. లక్ష నగదు అపహరించారు. అలాగే అదే అపార్ట్‌మెంట్ కింద పోర్షన్‌లో ఉంటున్న ఉపాధ్యాయిని ఇంట్లో కూడా చోరీకి పాల్పడ్డారు. ఎనిమిదిన్నర తులాల బంగారం, నగదు దోచుకుపోయారు. రెండు దొంగత నాలు జరిగిన తీరు ఒకేలా ఉండడంతో తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడ్డారని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్తంగా..

గెడ్డల్లో పూడిక తొలగింపు


పూడిక తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

వెంకోజీపాలెం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది గురువారం జోన్-3లోని గెడ్డల్లోని పూడికను తొలగించారు. జీవీఎంసీ 16వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో ప్రధాన గెడ్డలతో పాటు వీధుల్లోని కాలువలను సైతం శుభ్రం చేశారు. గెడ్డల్లో పేరుకుపోయిన మొక్కలను కూడా తొలగించారు. చెత్తను గెడ్డలలో పారేయ వద్దని, ఇంటికి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు సూచించారు. కార్యక్రమంలో శుభ్రం మేస్త్రి నమ్మి చిన్నరాజు, జి.బాబు ఉన్నారు.

తూనికలు, కొలతలపై కొనుగోలుదారులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీ రైతు బజారులో గురువారం నిర్వహించారు. జిల్లాతూనికలు, కొలతల అధికారి అప్పలరాజు, ఇన్‌స్పెక్టర్ రామారావు హాజరై, వస్తువుల నాణ్యత, ప్రమాణాలు, తూకంలో జరిగే మోసాలపై వినియోగదారులకు అవగాహన కలిగించారు.

నేత్ర వ్యాధులపై సదస్సు

ఆరిలోవ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : పురుషులలో కంటే మహిళల్లో 50 నుంచి అరవై శాతం వరకు అనేక రకాల నేత్ర వ్యాధులు సంభవిస్తాయని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ డాక్టర్ శివాని కొడాలి పేర్కొన్నారు. ఆమె గురువారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో మహిళలకు నేత్ర వ్యాధులపై అవగాహన కల్పించారు. హార్మోనుల కారణంగా మహిళలు ప్రభావితమవుతారని తెలిపారు. ముందస్తుగా గుర్తించడం, సత్వర చికిత్స చేస్తే నివారించవచ్చన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యువి:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా :** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 20, వంకాయలు (తెలుపు) 34,వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 44, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 28, క్యారెట్ 40 దొండకాయలు 44, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది)56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 36, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226


ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కృష్ణా కళాశాలలో ముగ్గుల పోటీలు

మద్దిలపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నేషనల్ జెండర్ క్యాంపెయిన్ నయా చేతన 3.0 కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, లింగ ఆధారిత హింస, మహిళలు గృహ హింస అంశాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా అంశాలపై విద్యార్థులు రంగవల్లికలు వేసి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. విజేతలకు ప్రిన్సిపాల్ విజయబాబు బహుమతులు అందించి అనంతరం మాట్లాడారు. ఉన్నత విద్యాశాఖ, యూజీసీ ఆదేశాల మేరకు మహిళా సాధికారత, ఐసీసీ, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా ఈ పోటీలు చేపట్టాయన్నారు. సమాజంలో మహిళలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆత్మవిశ్వాసంతో సమస్యలు తరిమికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.లక్ష్మి, పోల ఉమామహేశ్వరరావు, అనురాధ, రమ్య, పద్మావతి, పుష్పలత, పద్మజ, రాజారావు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిషేధంపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కన్వెన్షన్ హాలులో డ్రగ్స్ వాడకాన్ని నిరసిస్తూ యువతకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ జి.శశిభూషణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏయూను మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలను ఉపయోగించడం వల్ల ఆరోగ్యం, జీవితం, నాశనం అవుతాయన్నారు. యువత ఆరోగ్యవంత జీవనాన్ని అలవర్చుకొని ఉన్నత వ్యక్తిత్వంతో ఎదగాలన్నారు. విలువైన మానవ వనరులుగా యువతరం నిలుస్తూ దేశ అభ్యున్నతిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి జాలాది రవి, డ్రగ్స్ ప్రివెన్షన్ కమిటీ సమన్వయకర్త ఎస్.హరినాథ్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు వర్సిటీకి విలువైన సంపద

- ఏయూ వీసీ శశిభూషణరావు


సాంబశివరావును సత్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉన్నతంగా ఎదిగిన పూర్వ విద్యార్థులు వర్సిటీకి విలువైన సంపదగా నిలుస్తారని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.సాంబశివరావును సత్కరించారు. కామర్స్ మేనేజ్‌మెంట్ పూర్వ విద్యార్థిగా రాష్ట్రంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగిన డాక్టర్ సాంబశివరావు సాధించిన ప్రగతి నేటి తరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో చదువుతున్న విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని, వారు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఉన్న అవకాశాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఇతర ఆచార్యులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రిలో వైద్యుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన వైద్యుల పోస్టుల భర్తీకి యాజమాన్యం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సర్జరీ, పిడియాట్రిక్స్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ విభాగాల్లో ఎనిమిది పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎంబీబీఎస్ అర్హత గల వారికి తొలి ఏడాది రూ.50 వేలు, రెండో ఏడాది రూ.55 వేల చొప్పున స్టయిఫండ్ ఇస్తారు. అభ్యర్థుల వయసు గరిష్ఠంగా 35 ఏళ్లని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుందని ఉక్కు యాజమాన్యం పేర్కొంది. ఆసక్తి గలవారు ఈనెల 30న ఆస్పత్రిలో జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపింది.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


అప్రమత్తం చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఆరిలోవ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ స్పష్టం చేశారు. హనుమంతవాక జంక్షన్‌లో గురువారం మైకు ద్వారా ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధారణపై విస్తృత ప్రచారం నిర్వహించారు. జనవరి 1 నుంచి ఉత్తర్వులు అమలులోకి వస్తాయని ఆయన తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనాలను నడుపడం వలన అనుకోకుండా ప్రమాదం సంభవిస్తే తలకు ఎటువంటి గాయం రక్షణగా ఉంటుందని వివరించారు. ఈ విషయంలో ఎంతమాత్రం నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఒకవేళ ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భారీ జరిమానాలతో పాటు లైసెన్స్ రద్దు చేయడం వంటి చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ విషయంలో వాహనదారులు సహకరించాలని కోరారు.

రైతుబజార్లలో స్టాళ్ల కేటాయింపునకు లాటరీ

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వివిధ రైతుబజార్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను లాటరీ ద్వారా గురువారం కేటాయించారు. నగరంలోని 12 రైతుబజార్లలో 23 డ్వాక్రా దుకాణాలు, ఏడు దివ్యాంగుల దుకాణాలు కలిపి మొత్తం 30 ఖాళీలుండగా వాటికి గత నెలలో దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తుదారుల సమక్షంలోనే గురువారం లాటరీ తీశారు. కార్యక్రమంలో ఎంపిక కమిటీ, డీఆర్డీఏ పీడీ, మార్కెటింగ్ శాఖ ఏడీ, రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

వాసుదేవనగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలు సేకరిస్తున్న టీడీపీ నేతలు

అక్కయ్యపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 45వ వార్డు వాసుదేవనగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు, కార్యదర్శి నరేంద్ర, విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రాజు, నాయకులు ఎస్‌కే బాబ్జి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) నిర్వహించనున్న విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్-డి మ్యాచ్‌లు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. జనవరి ఐదు వరకు జరిగే మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు తెలిపారు. గ్రూప్-డిలో మిజోరం, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, చండీఘర్, విదర్భ, జమ్ము కాశ్మీర్ జట్లు తలపడతాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ మ్యాచ్‌లను ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు గేట్ నంబరు-15 నుంచి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఈనెల 21న ఛత్తీస్‌ఘడ్-మిజోరం, 23న మిజోరం-ఉత్తరప్రదేశ్, 26న తమిళనాడు-ఉత్తరప్రదేశ్, 28న చండీఘర్-విదర్భ, 31న తమిళనాడు-విదర్భ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

యువతి అదృశ్యం



సీతంపేట, డిసెంబరు 19, (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి సీతమ్మధార టీపీటీ కాలనీ నివాసం ఉంటున్న మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... టీపీటీ కాలనీలోని శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ముద్దాడ కన్నమ్మ (33) కొద్ది రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన కన్నమ్మ వివరాలు తెలిసిన వారు ఫోన్ : 7386985125, 8008041025కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

గ్రీన్‌బెల్ట్ పార్కుల్లో చిల్లర దొంగల చేతివాటం

» విద్యుద్దీపాలు, పైపులైన్ల వంటి సామగ్రి చోరీ



నాలుగు లేన్ల రహదారి గ్రీన్‌బెల్ట్ పార్కు



చోరులు కట్ చేసి పడేసిన పైపులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ పార్కుల్లో చిల్లర దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఈ పార్కులను జీవీఎంసీ అభివృద్ధి చేసింది. విద్యుత్ దీపాలు, వివిధ విగ్రహాలు, గోడలకు రంగులు వేసి ఎంతో అందంగా తీర్చిదిద్దారు. సాయంత్రం వేళల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి పార్కులోని విద్యుత్ లైట్లు, విద్యుత్ పైపులు, ఇతర సామగ్రి కట్ చేసి తీసుకుని వెళ్ళిపోతున్నారు. చోరులు సాయంత్రం సమయం లో పార్కుల్లోకి సందర్శకులుగా వచ్చి కూర్చొని అందరూ వెళ్ళిపోయిన తర్వాత ఆ వస్తువులను తస్కరిస్తున్నారని అంటున్నారు. మరుసటి రోజు ఉదయం పార్కుకు వచ్చిన వాకర్స్, సందర్శకులకు ఆ వస్తువులు కనిపించకపోయేసరికి వారు షాక్‌కు గురవుతున్నారు. ఇది చిల్లర దొంగల పని అని, ఇప్పుడు పార్కుల్లో చోరీలు చేయడం పనిగా పెట్టుకున్నారని స్థానికులు, పార్కులకు వచ్చే వారు అంటున్నారు. ఈ ప్రాంతంలో చోరీలు అరికట్టేందుకు పోలీసులు నిఘా పెట్టి తగు చర్యలు తీసుకోవాలని వాకర్స్, సందర్శకులు కోరుతున్నారు.

డెఫ్ టీ-20 క్రికెట్ టోర్నీ చాంపియన్ శ్రీకాకుళం

రన్నరప్‌గా ఆతిథ్య విశాఖ



విజేతగా నిలిచి శ్రీకాకుళం జట్టు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం జిల్లా స్పోర్ట్సు ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ సంఘం నిర్వహించిన ఏపీ జోనల్-1 డెఫ్ టీ-20 క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జట్టు చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆతిథ్య విశాఖ రన్నరప్‌గా నిలిచింది. గురువారం ఏసీఏ వీడీసీఏ-బి గ్రౌండ్‌లో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ జె.మాధవి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గ్యాలియట్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. తొలుత ద ఒలింపిక్ సంఘం విశాఖ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ట్రోఫీలను ఆవిష్కరించి మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జూన్ గ్యాలియట్ మాట్లాడుతూ డెఫ్ అండ్ డమ్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ టోర్నీలో పాల్గొంటున్న విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం,మన్యం (పాడేరు) జిల్లాల క్రీడాకారులను వసతి, భోజన సదుపాయాలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సమకూర్చిందని తెలిపారు. కార్యక్రమంలో సీసీఏ అకాడమీ డైరెక్టర్ అబిబ రూహి సయ్యద్, విశాఖ జిల్లా స్పోర్ట్సు ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ సంఘం ప్రతినిధులు హసీం, అబ్దుల్ అసదుల్లా, కె.నాగార్జున సాగర్, ఆర్.సంతోష్‌కుమార్, అబ్దుల్ సమీర్, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.



రన్నరప్ నిలిచిన విశాఖ జట్టు

దళిత ఉద్యోగులపై వేధింపులు తగవు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సీతమ్మధార, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దళిత ఉద్యోగులపై వేధింపులు మానాలని, ఎస్బీఐ రిటైర్డ్ ఉద్యోగి ఎం.రాజకిషోర్‌పై కక్ష సాధింపు తగదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం రామా టాకీస్ రోడ్డు ప్రాంతీయ ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఎదురుగా గల అంబేడ్కర్ భవన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూదళితుడైన రాజకిషోర్‌ను ఉద్యోగంలో ఉండగా ఎస్బీఐ యాజమాన్యం అకారణంగా సస్పెండ్ చేసిదని, పదవీ విరమణ చేసినప్పటికీ కక్ష సాధింపు చర్యలు ఆపలేదని, రావలసిన బకాయిలు ఇప్పటికి ఆయనకు చెల్లించలేదని అవేదన వ్యక్తం చేశారు. వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విదసం ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, భూపతి, కోన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీకి విశాఖ జట్టు



రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొననున్న జట్టు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి అండర్-15 బాలురు, బాలికల టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే విశాఖ జట్టును గురువారం ప్రకటించారు. కాకినాడలో జరిగే ఈ టోర్నీలో బాలికల విభాగంలో రేణుక సత్య, ఆరిఫా సుల్తానా, దీక్షిత, సెవిత శ్రీ....బాలుర విభాగంలో వి.హార్దిక్ రామ్, సాయిచరణ్, లిఖిత్, జాషువా ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు గురువారం క్రీడా దుస్తులు (ట్రాక్ షూట్) పంపిణీ చేశారు. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాదుస్తులు అందజేసి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ డీవీఎస్‌వై శర్మ, టెక్నికల్ కమిటీ మాజీ చైర్మన్ పీవీఎన్ సూర్యారావు, డీఎస్ఏ కోచ్ అచ్యుత్, మురళి పాత్రో, శేఖర్, వీఎస్ఎన్ మూర్తి, శ్రీకాంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులో 'అరకు ఉత్సవ్'

» 3 రోజుల పాటు నిర్వహణ » అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ వెల్లడి

పాడేరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'అరకు ఉత్సవ్'ను ఈ నెలాఖరులో నిర్వహించనున్నామని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు.

'ఉత్సవ్' ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో గురు వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటకులను అలరించేలా అరకు ఉత్సవ్‌ను నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పట్టణం మరింత సుందరంగా కనిపించేలా విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు.

అలాగే ఉత్సవ్ ప్రాంగణంలో వివిధ రకాల స్టాళ్లను పెట్టాలని, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మారథాన్, చిత్రలేఖనం, రంగోలి, కార్నివాల్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అలాగే గులాబీల ప్రదర్శన, హాట్ ఎయిర్ బెలూన్, కాఫీ రుచుల పోటీలు, గిరిజన కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలు ఏర్పాటుచేయాలన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

ఎస్.రాయవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలంలోని ఒక గ్రామంలో మతిస్థిమితం లేని యువతి (20)పై కె.నాగరాజు (43) అత్యాచారానికి పాల్పడినట్టు గురువారం ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం...

మతి స్థిమితం లేని యువతి ఒంటరిగా నడిచి వెళుతుండడం గమనించి అదే గ్రామానికి చెందిన నాగరాజు తన ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడైన నాగరాజును అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వర్షం దెబ్బకు చిత్తడిగా రహదారులు

మురళీనగర్, డిసెంబరు 19 ; అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు చిత్తడిగా తయారయ్యాయి. గ్రేటర్ విశాఖ 51వ వార్డు మాధవధార నరసింహనగర్, లాన్సమ్ గ్రీన్ రోడ్డు, 50వ వార్డు మురళీనగర్ సెక్టార్ 8 రోడ్లు, 49వ వార్డు మాణిక్యాంబకాలనీ తదితర ప్రాంతాలు సహా మాదవధార రామన్న కాలనీ, ఏకలవ్య కాలనీ ప్రాంతాల్లో వాన నీరు ముంచెత్తింది. బురద రోడ్లుగా ఉన్న మార్గాల్లో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. బిర్లా జంక్షన్ పాస్‌పోర్టు ఆఫీసు ఎదుట హైవే రోడ్డు సర్వీసు రోడ్డులో ఇలాంటి ఇబ్బందులతో గురువారం స్థానికులు ఇక్కట్లపాలయ్యారు

గోడౌన్ సూపర్‌వైజర్లు అరెస్టు

... 5వ పేజీ తరువాయి

సేకరించినవేనని తేలడంతో మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గోడౌన్ సూపర్‌వైజర్‌లుగా ఉన్న బుజ్జి, సుధాకర్ అనేవారిని బుధవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. అయితే రిమాండ్‌కు న్యాయస్థానం నిరాకరించడంతో గురువారం స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఈ కేసులో దాదాపు 11 కంటెయినర్‌లను పోలీసులు సీజ్ చేశారు. కార్డుదారుల నుంచి వేర్వేరు మార్గాల్లో సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రదేశంలో ప్యాకింగ్ చేసి రాత్రి సమయంలో గోదాములకు తరలించి, అక్కడి నుంచి నౌకల ద్వారా విదేశాలకు పంపుతున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసును మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ ఎస్ఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

4న నౌకాదళ విన్యాసాలు

... 5వ పేజీ తరువాయి

పర్యటించి ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. తూర్పు నౌకాదళానికి చెందిన అధికారి ఒకరు మాట్లాడుతూ నాలుగో తేదీ సాయంత్రం బీచ్‌లో ఓపీ డెమో జరుగుతుందని, లేజర్‌షో, డ్రోన్‌షో, నౌకల పైనుంచి విన్యాసాలు ఉంటాయన్నారు. జనవరి రెండో తేదీన పూర్తిస్థాయి రిహార్సల్స్ జరుగుతాయన్నారు.

నేవీ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం పూర్తిగా సహకరించాలని కోరారు. సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ అజిత వేజెండ్ల, నేవీ అధికారులు వైకే కిషోర్‌కుమార్, సంజీవ్‌శరణ్, ఉజైర్ కుస్రో, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ ఊయల

... 5వ పేజీ తరువాయి

ఊయలలు ఏర్పాటుచేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ఊయల పర్యవేక్షణ బాధ్యతను స్థానిక ఏఎన్ఎంకు అప్పగిస్తారు. ఊయల వద్ద బెల్ ఏర్పాటుచేస్తారు. ఎవరైనా బిడ్డను వదిలి వెళుతుంటే బెల్ కొట్టాల్సి ఉంటుంది. అయితే, దానివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని అధికారులు చెబుతున్నారు. బిడ్డను వద్దనుకుని వెళ్లివాళ్లు బెల్ ఎందుకు కొడతారని ప్రశ్నిస్తున్నారు.

శిశువులు దత్తత

ఊయలలో వేసే చిన్నారులకు సంబంధించిన వివరాలతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఒక ప్రకటన ఇస్తారు. అందులో పేర్కొన్న వ్యవధిలోగా ఎవరైనా రాకపోతే శిశువులను బాల సదనాల్లో అప్పగిస్తారు. అనంతరం పిల్లలు కావాలనుకునే వారికి అధికారికంగా దత్తత ఇస్తారు.

బడ్జెట్ లేకున్నా బడాయి!

... 5వ పేజీ తరువాయి

విభాగాలకు కేటాయించిన నిధులు మిగిలి ఉంటే వాటిని సర్దుబాటు చేస్తే తప్ప కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లింపు సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ఆ విషయాన్ని ఇంజనీరింగ్ విభాగం అధికారులు గుర్తించకుండా పనులకు ప్రతిపాదించడం చర్చనీయాంశమైంది.

కాగా జీవీఎంసీ పరిధిలో రూ.50 లక్షలకు పైబడిన పనులు చేపట్టేందుకు, బిల్లుల చెల్లింపునకు కచ్చితంగా కౌన్సిల్‌లో చర్చించి ఆమోదించాలి. రూ.50 లక్షలు కంటే తక్కువ విలువైన పనులకు సంబంధించిన నిర్ణయాలు మాత్రమే స్టాండింగ్ కమిటీ తీసుకోవడానికి అధికారం ఉంటుంది. 84వ వార్డులో సీసీ రోడ్లు, ఆర్‌సీసీ కాలువలు నిర్మాణం కోసం రూ.1.39 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు వేసినందున ఆ అంశాన్ని కచ్చితంగా కౌన్సిల్ సమావేశంలో పెట్టాలి. వారం కిందటే కౌన్సిల్ సమావేశం జరిగింది. కానీ, అక్కడ ఆ అంశాన్ని అధికారులు పొందుపరచకుండా, మూడు ముక్కలుగా విభజించి ఒక్కొక్క పని విలువ రూ.50 లక్షల లోపునకు తగ్గించి వేర్వేరు అంశాలుగా స్టాండింగ్ కమిటీ ఎజెండాలో పొందుపరచడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

హెల్మెట్ ధారణపై స్పెషల్ ఫోకస్

... 5వ పేజీ తరువాయి

హెల్మెట్ ఉన్నప్పటికీ మరణించిన వారి సంఖ్య 30కి తగ్గింది.

హైకోర్టు ఆదేశాలతో తనిఖీలు మరింత ముమ్మరం:

రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని కారణంగా మూడు నెలల్లోనే 688 మంది మరణించడంపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. వాహన చోదకులు హెల్మెట్ ధరించేలా కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో నగరంలో తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జూలై నుంచి డిసెంబరు 18 వరకూ హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న 4,73,441 మందిపై కేసులు నమోదుచేసి వారి నుంచి రూ.4,73,44,100 వసూలుచేసేలా ఈ-చలాన్‌లు జారీచేశారు. పట్టుబడిన వారిలో 1,18,594 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు.

చాలావరకూ మార్పు కనిపిస్తుంది

సీపీ శంఖబ్రతబాగ్చి

నగరంలో హెల్మెట్ ధారణపై విస్తృతంగా అవగాహన కల్పించడం, ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ జరిమానాలు విధించడం, లైసెన్స్‌లు సస్పెన్షన్ చేయడంతో చాలావరకు మార్పు కనిపిస్తోంది. నేను సీపీగా బాధ్యతలు తీసుకున్నప్పుడు నగరంలో 20 శాతం హెల్మెట్ ధారణ ఉంటే ఇప్పుడు 50 శాతానికి పెరిగింది. వచ్చే ఫిబ్రవరి నాటికి శతశాతం చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం. పోలీసులను చూసి కొంతమంది హెల్మెట్ పెట్టుకుంటున్నారు. దాటగానే హెల్మెట్ తీసి మళ్లీ పక్కనపెడుతున్నారు. అలాంటి వారికి చెక్ పెట్టడానికి తగరపువలస నుంచి కూర్మన్నపాలెం వరకు ఉన్న సిగ్నల్స్‌తోపాటు నగరంలోని అన్ని సిగ్నల్స్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ కలిగిన ఆటోమెటిక్ ఫేసియల్ రికగ్నైజేషన్ కెమెరాలు ఏర్పాటుచేయబోతున్నాం. ఈ నెలాఖరుకు డీపీఆర్ ఖరారైపోతుంది కాబట్టి జనవరి చివరి నాటికి ఈ సదుపాయం అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల ట్రిపుల్ రైడింగ్ చేసినా, హెల్మెట్ ధరించకపోయినా, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా, సిగ్నల్ జంపింగ్ చేసినా ఆటోమెటిక్‌గా ఫొటోతో ఈ-చలాన్ జారీ అయిపోతుంది. ఆ సమాచారంతోపాటు వాహనం నడిపేవారి ముఖం ఫొటో కూడా తీయడం వల్ల వారి వివరాలన్నీ పోలీస్ శాఖతోపాటు రవాణా శాఖకు చేరతాయి. దాంతో వాహనం నడిపేవారి డ్రైవింగ్ లైసెన్స్ ఆటోమేటిక్‌గా సస్పెండ్ అయిపోతుంది. ఒకవేళ డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు అయితే వాహనం యజమానికి భారీ జరిమానాతో ఈ-చలాన్ చేరుతుంది. దీనివల్ల తప్పనిసరిగా అందరూ ట్రాఫిక్ నిబంధనలతోపాటు రహదారి భద్రతను పాటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

నేవీ ఉద్యోగి ఆత్మహత్య

మహారాణిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాన్వెంట్ జంక్షన్‌లో గల ఒక హోటల్‌లో నేవీ ఉద్యోగి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన ఆర్.రంజిత్‌కుమార్ (23) విశాఖలో నౌకాదళంలో పని చేస్తున్నాడు. అతను కొన్ని రోజులుగా సెలవులో ఉన్నాడు. ఈనెల 14న తమిళనాడు నుంచి నగరానికి వచ్చి కాన్వెంట్ జంక్షన్‌లోని ఒక హోటల్‌లో దిగాడు. బుధవారం అతను రూమ్ నుంచి బయటకు రాకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వెళ్లి రూమ్ తెరచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి ఫోన్‌లో ఉన్న నంబర్లు ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు, నేవీ అధికారులకు సమాచారం అందజేశారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు

డాబాగార్డెన్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. అమిత్ షా ఫొటోలను దహనం చేసి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరిడి భగత్ మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ అంబేడ్కర్‌ను తరచూ అవమానిస్తున్నాయన్నారు. అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గాంధీజీ, నెహ్రూతో పాటు అంబేడ్కర్‌ను బీజేపీ, ఆర్ఎస్ఎస్ అవకాశం దొరికనప్పుడల్లా అవమానిస్తున్నారన్నారు. ఇది దేశంలో ఉన్న దళిత, మైనారిటీ, సామాన్య ప్రజలపై దాడిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త కేవీ సూర్యనారాయణ, నాయకులు సోడాదాసు సుధాకర్, చిన్నబాబు, జగన్ మురారి, కస్తూరి, అప్పారావు, కాండవ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో...

అంబేడ్కర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని దళిత సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. వారు డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవుడా అంటే పుణ్యమైనా వస్తుందని, అంబేడ్కర్‌ను తలిస్తే ఏమీ వస్తుందని అమిత్ షా అవమానకరంగా మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కల్యాణరావు, ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, శాంతారావు, పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు



కనక మహాలక్ష్మి అమ్మవారు

కనకమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

» మూడో వారమూ తగ్గని తాకిడి
» కిటకిటలాడిన క్యూ లైన్లు
» బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రాత్రి వరకూ రద్దీ

జగదాంబ కూడలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మూడో గురువారం కూడా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రాత్రి వరకూ ఒకే విధమైన రద్దీ కొనసాగింది. రూ. 500, రూ. 200, రూ. 100 దర్శనాల క్యూలు ప్రధాన ఆలయం నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు నిండిపోయాయి. ఆలయ ఆవరణలో ఎక్కడ చూసినా భక్తజన సందడి నెలకొంది. నగరం నలుమూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కూడా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారి నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వీఐపీలు, వీవీఐపీలతో సంబంధం లేకుండా సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాల కోసం సిఫార్సు లేఖలతో వచ్చిన వారు పీఆర్‌ఓ కార్యాలయం వద్ద బారులు తీరారు. ఉత్సవాల్లో భాగంగా 3 నుంచి 5 గంటల మధ్య ఈ దర్శనాలకు అవకాశం కల్పించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధుల లేఖలతో వచ్చిన వారికి విక్టోరియా ఆసుపత్రి వద్ద వీఐపీ, వీవీఐపీ దర్శనాలకు క్యూ లైన్ ఏర్పాటు చేశారు. అడ్డగోలు దర్శనాలకు బ్రేక్ వేసేందుకు పోలీసులు, దేవస్థానం అధికారులు పకడ్బందీగా వ్యవహరించారు. వన్ టౌన్ సీఐ దేముడుబాబు ఆలయ ఆవరణలో తిరుగుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అధికారులు క్యూలైన్లలో ఉన్న వారికి తాగునీరు, మజ్జిగ, పిల్లలకు బిస్కెట్లు అందజేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేప ట్టారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో శోభారాణి, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

స్వర్ణ వస్త్రాలంకరణలో కన్యకా పరమేశ్వరి

మహారాణిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వన్ టౌన్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని గురువారం స్వర్ణ వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు, అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో అభిషేకం జరిపారు. సాయంత్రం వందలాది మహిళలతో సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం జరిపారు. ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా క్రిస్మస్ దీపారాధన

అల్లిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాపురం దరి పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ దీపారాధన ఘనంగా నిర్వహించారు. క్రీస్తు భక్తులంతా జ్ఞానాపురం వీధుల్లో కొవ్వొత్తులతో క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ.. ప్రదక్షిణ చేశారు. అనంతరం సిలువ గుర్తు మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్, సహాయ విచారణ కర్తలు వినయ్‌కుమార్, ఆంథోనిరాజ్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

జల సంరక్షణ పనులపై సమీక్ష

మహారాణిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టనున్న జల వనరుల సంరక్షణ పనుల్లో దాతలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. థాన్ ఫౌండేషన్, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయాలు, నిధుల సమీకరణపై గురువారం ఆయన తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జన వనరుల సంరక్షణకు చేపట్టనున్న చర్యలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం జల సంరక్షణకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

చిన్నారులకు దుస్తులు అందజేత

అల్లిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేఎన్ఆర్ ట్రస్టు ద్వారా నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. గురువారం ఆయన అల్లిపురం నేరెళ్ల కోనేరు వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో చిన్నారులకు దుస్తులు అందజేశారు.

సచివాలయాల్లో జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

- మెరుగైన సేవలు అందించాలని ఆదేశం
- పనితీరు, పన్నుల వసూళ్లపై ఆరా
- సిబ్బందికి పలు సూచనలు
- అన్నక్యాంటీన్ల పనితీరు పరిశీలన



పన్నుల వసూళ్ల గురించి ఆరా తీస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ వార్డు కార్యదర్శులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన 3వ జోన్‌లోని ఆర్కే బీచ్‌లో రామకృష్ణ మిషన్ లైబ్రరీ వద్ద ఉన్న 21086164, 21086165, 21086166 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సచివాలయంలో కార్యదర్శుల విధులు, హాజరు, డైరీ తదితరాలను పరిశీలించారు. సచివాలయ పరిధిలో ఎన్ని నూతన నిర్మాణాలు, అనధికార కట్టడాలు ఎన్నింటిని గుర్తించారని డబ్ల్యుపీఆర్ఎస్ కార్యదర్శులను ఆరా తీరారు. 21086165 సచివాలయంలో ఆస్తి, తాగు నీటి పన్నులు ఇప్పటి వరకు ఎంత వసూలు చేశారని వాకబు చేశారు. 21086166 సచివాలయంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం వచ్చిన వారితో మాట్లాడుతూ మీకు ఎన్ని రోజుల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందిందని అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలకు రోజుకు ఎన్ని అర్జీలు వస్తున్నాయని, ప్రజలు పొందే సేవలు వాటి వివరాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. సచివాలయాలకు ప్రజలు తక్కువగా వస్తున్నందున ఖాళీ సమయంలో జీవీఎంసీ చేపడుతున్న శానిటేషన్, ఆస్తి పన్ను వసూలు, ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాలు విభజన, సేంద్రీయ ఎరువు తయారీ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆదేశించారు. ప్రజలకు అందించే సేవల గురించి తెలిపే బోర్డులను సచివాలయాల బయట ప్రదర్శించాలని కార్యదర్శులను సూచించారు. సచివాలయాల సమీపంలో పరిశుభ్రతను నిత్యం పాటించాలన్నారు. మహిళా పోలీస్ కార్యదర్శుల విధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాల సమీపంలోనున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించి, అన్న క్యాంటీన్‌లో భోజనం నాణ్యత, పరిశుభ్రత, మంచి నీటి సరఫరా తదితర వాటిని పరిశీలించారు. భోజనానికి వచ్చిన వారితో మాట్లాడి భోజనాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్లలో పరిశుభ్రతతో కూడిన రుచికరమైన భోజనం ప్రజలకు అందించాలని అన్న క్యాంటీన్ ఆహార సరఫరా నిర్వాహకులను ఆదేశించారు. ఈ పర్యటనలో 3వ జోనల్ కమిషనరు కె.శివప్రసాద్, రెవెన్యూ అధికారి డేవిడ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

గెడ్డల్లో పూడిక తొలగింపు



పూడిక తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

వెంకోజీపాలెం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది గురువారం జోన్-3లోని గెడ్డల్లోని పూడికను తొలగించారు. జీవీఎంసీ 16వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో ప్రధాన గెడ్డలతో పాటు వీధుల్లోని కాలువలను సైతం శుభ్రం చేశారు. గెడ్డల్లో పేరుకుపోయిన మొక్కలను కూడా తొలగించారు. చెత్తను గెడ్డలలో పారేయ వద్దని, ఇంటికి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు సూచించారు. కార్యక్రమంలో శుభ్రం మేస్త్రి నమ్మి చిన్నరాజు, జి.బాబు ఉన్నారు.

తూనికలు, కొలతలపై కొనుగోలుదారులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీ రైతు బజారులో గురువారం నిర్వహించారు. జిల్లా తూనికలు, కొలతల అధికారి అప్పలరాజు, ఇన్‌స్పెక్టర్ రామారావు హాజరై, వస్తువుల నాణ్యత, ప్రమాణాలు, తూకంలో జరిగే మోసాలపై వినియోగదారులకు అవగాహన కలిగించారు.

నేత్ర వ్యాధులపై సదస్సు

ఆరిలోవ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : పురుషులలో కంటే మహిళల్లో 50 నుంచి అరవై శాతం వరకు అనేక రకాల నేత్ర వ్యాధులు సంభవిస్తాయని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ డాక్టర్ శివాని కొడాలి పేర్కొన్నారు. ఆమె గురువారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో మహిళలకు నేత్ర వ్యాధులపై అవగాహన కల్పించారు. హార్మోనుల కారణంగా మహిళలు ప్రభావితమవుతారని తెలిపారు. ముందస్తుగా గుర్తించడం, సత్వర చికిత్స చేస్తే నివారించవచ్చన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా :** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (వరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 20, వంకాయలు (తెలుపు) 34,వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 44, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 28, క్యారెట్ 40 దొండకాయలు 44, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది)56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 36, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామ కాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

ఉత్తరాంధ్ర రాజకీయ దురంధరుడు ద్రోణంరాజు



ద్రోణంరాజుకు నివాళులు అర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, శ్రీవత్సవ, రమణికుమారి, జహీర్ అహ్మద్ తదితరులు

సిరిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రలోని రాజకీయ దురంధరుడు స్వర్గీయ ద్రోణంరాజు సత్యనారాయణ అని పలువురు వక్తలు కొనియాడారు. ద్రోణంరాజు 92వ జయంతి సందర్భంగా గురువారం సిరిపురంలోని ద్రోణంరాజు సర్కిల్ వద్ద ఆయన మనవడు, వైసీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ఆధ్వర్యంలో పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. విశాఖ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తిరెడ్డి తదితరులు హాజరై ద్రోణంరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ద్రోణంరాజు సత్యనారాయణ ఎందరో నేతలను అందించిన రాజకీయ యూనివర్సిటీగా పేర్కొన్నారు.ఆయన రాజకీయ శిష్యులెందరో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా పదవులు పొందారన్నారు. ఆయన కుమారుడు స్వర్గీయ ద్రోణంరాజు శ్రీనివాస్ ఒక నిబద్ధత కలిగిన నాయకుడిగా ఎదిగారన్నారు. ఆయన మనమడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ సైతం అదే నిబద్ధతతో పయనిస్తున్నారన్నారు. శ్రీవత్సవ్ మాట్లాడుతూ తాత, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ మచ్చలేని నాయకుడిగా ప్రజలకు సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు కోడూరి అప్పలరత్నం, బిపిన్‌కుమార్ జైన్, ఊరుకుటి చందు, మాజీ వుడా చైర్మన్ రవి, డాక్టర్ జహీర్ అహ్మద్, బెహర భాస్కరరావు, రవిరెడ్డి, పేడాడ రమణికుమారి తిప్పల దేవన్‌రెడ్డి, జాన్‌వెస్లీ పెద్ద సంఖ్యలోఅభిమానులు హాజరై నివాళులుఅర్పించారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : ఏయూ వీసీ

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యువతరం పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. గురువారం ఏయూ కాన్వొకేషన్ హాలులో నిర్వహించిన ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీలో ఉన్న కాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు వేదికగా విశ్వవిద్యాలయ వ్యవస్థ నిలుస్తుందన్నారు. వర్సిటీ వనరులు, వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా జ్ఞానాన్ని సంపాదించడం ప్రధానమని చెప్పారు. నిపుణులైన ఆచార్యుల మార్గదర్శకాన్ని స్వీకరించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక ఏయూలో ఉన్నత విద్యను అభ్యసించడం, ఇక్కడ నేర్చుకున్న పాఠాలను నిత్యజీవితంలో కార్యరూపంలో చూపుతూ కార్యసాధకులుగా మారాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో మెగా జాబ్ మేళా రేపు

మద్దిలపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు. జేకేసీ, సూర్య ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో జరిగే మేళాలో టాటా గ్రూప్, జెన్‌పాక్ట్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, అరబిందో, హోండా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, పేటీఎం, ఎస్‌బ్యాంక్, ఐడీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, అపోలో తదితర సంస్థలు ఇంటార్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. నిరుద్యోగులు బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలతో కళాశాలలో ఉదయం 9.30 గంటలకు హాజరై రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ఎస్కేఎల్ఎం నగర్‌లో వెలిసిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి గురువారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మూడో మార్గశిర గురువారం కావడంతో వేకువ జాము నుంచి వచ్చి అమ్మవారిని దర్శనానికి క్యూ కట్టారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో దర్శనానికి సుమారు గంట వరకు వేచి ఉండవలసి వచ్చింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారికి స్వయంగా క్షీరాభిషేకాలు, పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు.

వాయు కాలుష్య నియంత్రణకు కార్యాచరణ

- ఆర్తా గ్లోబల్ సంస్థతో కలిసి జీవీఎంసీ ప్రణాళిక
- ఏడీసీ రమణమూర్తి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రమణమూర్తి

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో వాయు కాలుష్య నియంత్రణకు ఆర్తా గ్లోబల్ సంస్థతో కలిసి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు శివ ప్రసాద్ రాజు అధ్యక్షతన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో వాయు కాలుష్య నియంత్రణ కోసం జీవీఎంసీ, ఆర్తా గ్లోబల్ సంస్థ సంయుక్తంగా వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీ రమణమూర్తి మాట్లాడుతూ నగరంలో పెరిగిపోతున్న దృశ్య కాలుష్య నియంత్రణకు ఆర్తా గ్లోబల్ సంస్థ, జీవీఎంసీ సంయుక్తంగా కృషి చేస్తుందని.. ముఖ్యంగా విశాఖ నగరాన్ని క్లీన్ హెయిర్ జోన్స్‌గా నిలిపేందుకు కార్యచరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ప్రాంతంలో కాలుష్య నియంత్రణకు ఏ విధంగా చర్యలు చేపట్టాలనే అంశంపై పలు సలహాలు, సూచనలు ఏయూ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథారిటీ, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తదితర వారితో చర్చించి చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపడతామని తెలిపారు. అనంతరం డిజిటల్ ట్రాన్స్ పార్మేషన్ అంశంపై శిక్షణ కార్యక్రమాలను జీవీఎంసీ అధికారులు, ఏయూ విద్యార్థులకు ఆర్తా గ్లోబల్, ఈ-గవర్నమెంట్ ఫౌండేషన్ ప్రతినిధులు నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం అదనపు కమిషనరు ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాదరాజు క్లీన్ ఎయిర్, ట్రాఫిక్ నియంత్రణ, కాలుష్యం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, బాలప్రసాద్, డీటీవో ఆదినారాయణ, ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రతినిధులు తెరి ప్రతినిధులు డాక్టర్ అంజాగోయిల్, శివాని, ఈగవర్నర్ ఫౌండేషన్ అమేయ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ న్యాయ కళాశాల హాస్టల్‌కు మంచాలు వితరణ



దాతలను సత్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల విద్యార్థుల హాస్టల్‌కి రాజమండ్రికి చెందిన జక్కంపూడి సరోజలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు జక్కంపూడి రాహుల్ దత్త, శ్రావ్యలు 30 మంచాలు, దుప్పట్లను వితరణ చేశారు. సుమారు రూ.1.5 లక్షలతో కొనుగోలు చేసి వీటిని విద్యార్థులకు ఉపయుక్తంగా తయారు చేయించి గురువారం న్యాయ కళాశాల హస్టల్‌లో అందజేశారు. అనంతరం వీరు ఏయూ వీసీ జి.శశిభూషణరావుతో సమావేశం అయ్యారు. న్యాయ కళాశాల విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే మంచాలను హాస్టలుకు బహూకరించడం పట్ల వీసీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున దాతలను సత్కరించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం, న్యాయ కళాశాల హాస్టల్ చీఫ్ వార్డెన్ ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే వినియోగదారుల హక్కుల సాధన



ప్రసంగిస్తున్న బేగం

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అవగాహనతోనే వినియోగదారుల హక్కుల సాధన సాధ్యపడుతుందని జిల్లా వినియోగదారుల వివాదాలు పరిష్కార కమిషన్ సభ్యురాలు రహిమున్నీసా బేగం పేర్కొన్నారు. ఏయూలోని సోషల్ వర్క్ విభాగంలో గురువారం వినియోగదారుల హక్కులపై ప్రత్యేక ప్రసంగం నిర్వహించారు. వినియోగదారుల హక్కులపై రహిమున్నీషా బేగం ప్రత్యేక ప్రసంగం చేశారు. పోటీ ప్రపంచంలో వినియోగదారులను కార్పొరేటు సంస్థలు అనేక విధాలుగా మోసం చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థి స్థాయి నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహన ఎంతో ముఖ్యం అన్నారు. సోషల్ వర్క్ విభాగం విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.హరనాథ్, డాక్టర్ కోమల్ సలోమి, పుష్పలత, వేసవిల, ఆశాకిరణ్, శ్యామ్, శిరీష, అమిత, సూరిబాబు, లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సంక్షేమ భవనం కోసం భూమి కేటాయించాలి



వీఎంఆర్డీఏ చైర్మన్‌తో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సిరిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖలోని సీనియర్ సిటిజన్ల కోసం సంక్షేమ సముదాయానికి భూమి కేటాయించాలని విశాఖపట్నం జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్‌ను కలిసి కోరారు. సిరిపురం వీఎంఆర్డీఏలోని ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ వీడీఎస్‌సీడబ్ల్యుఏ మొత్తం 12 వేల కంటే ఎక్కువ మంది సభ్యులను కలిగి ఉందన్నారు. ఇది 18 సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ సమాఖ్య అన్నారు.సంఘం సభ్యులు సమావేశాలు, ఇతర కార్యక్రమాలు చేపట్టేందుకు సంక్షేమ సముదాయానికి భూమి కేటాయించాలని కోరారు. దీనిపై వీఎంఆర్డీఏ చైర్మన్ స్పందిస్తూ సాధ్యమైనంత మేరకు భూమి కేటాయింపులో సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తానని చెప్పారు.

బుచ్చిరాజుపాలెంలో రెండు ఇళ్లల్లో చోరీ

10 తులాల బంగారం, రూ. లక్ష నగదు అపహరణ



మర్రిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎయిర్ పోర్ట్ పోలీసు స్టేషన్ పరిధిలోని బుచ్చిరాజుపాలెం గవర వీధిలో బుధవారం చోరీ జరిగింది. వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. గవరవీధి రామాలయం సమీ పంలో ఉన్న అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తులో గిడిజాల అప్పలనాయుడు లక్ష్మీ దంప తులు నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె ఓణీ ఫంక్షన్ నిమిత్తం ఆదివారం వారు పద్మనాభం మండలం విజయరాంపురం వెళ్లారు. అదే అపార్ట్‌మెంట్ కింద పోర్షన్‌లో ఉంటున్న మహిళ దుస్తులు ఆరబెట్టేందుకు గురువారం ఉదయం అటువైపుగా వెళ్లగా అప్పల నాయుడు ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించింది. ఇంట్లో ఎవరూ ఉన్న అలికిరి లేకపోవడంతో బాధితులకు ఫోన్ చేసి, విషయాన్ని తెలిపారు. వెంటనే ఇంటికి వచ్చిన అప్పలనాయుడు చోరీ జరిగినట్టు గుర్తించి ఎయిర్ పోర్ట్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. జోన్-2 ఏసీపీ లక్ష్మణరావు, ఎయిర్ పోర్ట్ క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సుదర్శన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుల నుంచి వివరాలు సేకరిం చారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. అర్ధరాత్రి తరువాత దొంగలు తలుపులు విరగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, రూ. లక్ష నగదు అపహరించారు. అలాగే అదే అపార్ట్‌మెంట్ కింద పోర్షన్‌లో ఉంటున్న ఉపాధ్యాయిని ఇంట్లో కూడా చోరీకి పాల్పడ్డారు. ఎనిమిదిన్నర తులాల బంగారం, నగదు దోచుకుపోయారు. రెండు దొంగత నాలు జరిగిన తీరు ఒకేలా ఉండడంతో తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడ్డారని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కృష్ణా కళాశాలలో ముగ్గుల పోటీలు

మద్దిలపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నేషనల్ జెండర్ క్యాంపెయిన్ నయా చేతన 3.0 కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, లింగ ఆధారిత హింస, మహిళలు గృహ హింస అంశాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా అంశాలపై విద్యార్థులు రంగవల్లికలు వేసి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. విజేతలకు ప్రిన్సిపాల్ విజయబాబు బహుమతులు అందించి అనంతరం మాట్లాడారు. ఉన్నత విద్యాశాఖ, యూజీసీ ఆదేశాల మేరకు మహిళా సాధికారత, ఐసీసీ, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా ఈ పోటీలు చేపట్టాయన్నారు. సమాజంలో మహిళలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆత్మవిశ్వాసంతో సమస్యలు తరిమికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.లక్ష్మి, పోల ఉమామహేశ్వరరావు, అనురాధ, రమ్య, పద్మావతి, పుష్పలత, పద్మజ, రాజారావు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిషేధంపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కన్వెన్షన్ హాలులో డ్రగ్స్ వాడకాన్ని నిరసిస్తూ యువతకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ జి.శశిభూషణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏయూను మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలను ఉపయోగించడం వల్ల ఆరోగ్యం, జీవితం, నాశనం అవుతాయన్నారు. యువత ఆరోగ్యవంత జీవనాన్ని అలవర్చుకొని ఉన్నత వ్యక్తిత్వంతో ఎదగాలన్నారు. విలువైన మానవ వనరులుగా యువతరం నిలుస్తూ దేశ అభ్యున్నతిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి జాలాది రవి, డ్రగ్స్ ప్రివెన్షన్ కమిటీ సమన్వయకర్త ఎస్.హరినాథ్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు వర్సిటీకి విలువైన సంపద

- ఏయూ వీసీ శశిభూషణరావు



సాంబశివరావును సత్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉన్నతంగా ఎదిగిన పూర్వ విద్యార్థులు వర్సిటీకి విలువైన సంపదగా నిలుస్తారని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.సాంబశివరావును సత్కరించారు. కామర్స్ మేనేజ్‌మెంట్ పూర్వ విద్యార్థిగా రాష్ట్రంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగిన డాక్టర్ సాంబశివరావు సాధించిన ప్రగతి నేటి తరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో చదువుతున్న విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని, వారు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఉన్న అవకాశాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఇతర ఆచార్యులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రిలో వైద్యుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన వైద్యుల పోస్టుల భర్తీకి యాజమాన్యం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సర్జరీ, పిడియాట్రిక్స్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ విభాగాల్లో ఎనిమిది పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎంబీబీఎస్ అర్హత గల వారికి తొలి ఏడాది రూ.50 వేలు, రెండో ఏడాది రూ.55 వేల చొప్పున స్టయిఫండ్ ఇస్తారు. అభ్యర్థుల వయసు గరిష్ఠంగా 35 ఏళ్లని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుందని ఉక్కు యాజమాన్యం పేర్కొంది. ఆసక్తి గలవారు ఈనెల 30న ఆస్పత్రిలో జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపింది.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



అప్రమత్తం చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఆరిలోవ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ స్పష్టం చేశారు. హనుమంతవాక జంక్షన్‌లో గురువారం మైకు ద్వారా ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధారణపై విస్తృత ప్రచారం నిర్వహించారు. జనవరి 1 నుంచి ఉత్తర్వులు అమలులోకి వస్తాయని ఆయన తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనాలను నడుపడం వలన అనుకోకుండా ప్రమాదం సంభవిస్తే తలకు ఎటువంటి గాయం రక్షణగా ఉంటుందని వివరించారు. ఈ విషయంలో ఎంతమాత్రం నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఒకవేళ ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భారీ జరిమానాలతో పాటు లైసెన్స్ రద్దు చేయడం వంటి చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ విషయంలో వాహనదారులు సహకరించాలని కోరారు.

రైతుబజార్లలో స్టాళ్ల కేటాయింపునకు లాటరీ

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వివిధ రైతుబజార్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను లాటరీ ద్వారా గురువారం కేటాయించారు. నగరంలోని 12 రైతుబజార్లలో 23 డ్వాక్రా దుకాణాలు, ఏడు దివ్యాంగుల దుకాణాలు కలిపి మొత్తం 30 ఖాళీలుండగా వాటికి గత నెలలో దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తుదారుల సమక్షంలోనే గురువారం లాటరీ తీశారు. కార్యక్రమంలో ఎంపిక కమిటీ, డీఆర్‌డీఏ పీడీ, మార్కెటింగ్ శాఖ ఏడీ, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

వాసుదేవనగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలు సేకరిస్తున్న టీడీపీ నేతలు

అక్కయ్యపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 45వ వార్డు వాసుదేవనగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు, కార్యదర్శి నరేంద్ర, విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రాజు, నాయకులు ఎస్‌కే బాబ్జి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) నిర్వహించనున్న విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్-డి మ్యాచ్‌లు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. జనవరి ఐదు వరకు జరిగే మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు తెలిపారు. గ్రూప్-డిలో మిజోరం, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, చండీఘర్, విదర్భ, జమ్ము కాశ్మీర్ జట్లు తలపడతాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ మ్యాచ్‌లను ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు గేట్ నంబరు-15 నుంచి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఈనెల 21న ఛత్తీస్‌ఘడ్-మిజోరం, 23న మిజోరం-ఉత్తరప్రదేశ్, 26న తమిళనాడు-ఉత్తరప్రదేశ్, 28న చండీఘర్-విదర్భ, 31న తమిళనాడు-విదర్భ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

యువతి అదృశ్యం



సీతంపేట, డిసెంబరు 19, (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి సీతమ్మధార టీపీటీ కాలనీ నివాసం ఉంటున్న మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైంది స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. టీపీటీ కాలనీలోని శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ముద్దాడ కన్నమ్మ (33) కొద్ది రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన కన్నమ్మ వివరాలు తెలిసిన వారు ఫోన్ : 7386985125, 8008041025కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

గ్రీన్‌బెల్ట్ పార్కుల్లో చిల్లర దొంగల చేతివాటం

» విద్యుద్దీపాలు, పైపులైన్ల వంటి సామగ్రి చోరీ



నాలుగు లేన్ల రహదారి గ్రీన్‌బెల్ట్ పార్కు



చోరులు కట్ చేసి పడేసిన పైపులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ పార్కుల్లో చిల్లర దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఈ పార్కులను జీవీఎంసీ అభివృద్ధి చేసింది. విద్యుత్ దీపాలు, వివిధ విగ్రహాలు, గోడలకు రంగులు వేసి ఎంతో అందంగా తీర్చిదిద్దారు. సాయంత్రం వేళల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి పార్కులోని విద్యుత్ లైట్లు, విద్యుత్ పైపులు, ఇతర సామగ్రి కట్ చేసి తీసుకుని వెళ్లిపోతున్నారు. చోరులు సాయంత్రం సమయం లో పార్కుల్లోకి సందర్శకులుగా వచ్చి కూర్చొని అందరూ వెళ్లిపోయిన తర్వాత ఆ వస్తువులను తస్కరిస్తున్నారని అంటున్నారు. మరుసటి రోజు ఉదయం పార్కుకు వచ్చిన వాకర్స్, సందర్శకులకు ఆ వస్తువులు కనిపించకపోయేసరికి వారు షాక్‌కు గురవుతున్నారు. ఇది చిల్లర దొంగల పని అని, ఇప్పుడు పార్కుల్లో చోరీలు చేయడం పనిగా పెట్టుకున్నారని స్థానికులు, పార్కులకు వచ్చే వారు అంటున్నారు. ఈ ప్రాంతంలో చోరీలు అరికట్టేందుకు పోలీసులు నిఘా పెట్టి తగు చర్యలు తీసుకోవాలని వాకర్స్, సందర్శకులు కోరుతున్నారు.

డెఫ్ టీ-20 క్రికెట్ టోర్నీ చాంపియన్ శ్రీకాకుళం

రన్నరప్‌గా ఆతిథ్య విశాఖ



విజేతగా నిలిచి శ్రీకాకుళం జట్టు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం జిల్లా స్పోర్ట్సు ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ సంఘం నిర్వహించిన ఏపీ జోనల్-1 డెఫ్ టీ-20 క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జట్టు చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆతిథ్య విశాఖ రన్నరప్‌గా నిలిచింది. గురువారం ఏసీఏ వీడీసీఏ-బి గ్రౌండ్‌లో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గ్యాలియట్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. తొలుత ద ఒలింపిక్ సంఘం విశాఖ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ట్రోఫీలను ఆవిష్కరించి మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జూన్ గ్యాలియట్ మాట్లాడుతూ డెఫ్ అండ్ డమ్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ టోర్నీలో పాల్గొంటున్న విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం,మన్యం (పాడేరు) జిల్లాల క్రీడాకారులను వసతి, భోజన సదుపాయాలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సమకూర్చిందని తెలిపారు. కార్యక్రమంలో సీసీఏ అకాడమీ డైరెక్టర్ అబిబ రూహి సయ్యద్, విశాఖ జిల్లా స్పోర్ట్సు ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ సంఘం ప్రతినిధులు హసీం, అబ్దుల్ అసదుల్లా, కె.నాగార్జున సాగర్, ఆర్.సంతోష్‌కుమార్, అబ్దుల్ సమీర్, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.



రన్నరప్ నిలిచిన విశాఖ జట్టు

దళిత ఉద్యోగులపై వేధింపులు తగవు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సీతమ్మధార, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దళిత ఉద్యోగులపై వేధింపులు మానాలని, ఎస్బీఐ రిటైర్డ్ ఉద్యోగి ఎం.రాజకిషోర్‌పై కక్ష సాధింపు తగదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం రామా టాకీస్ రోడ్డు ప్రాంతీయ ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఎదురుగా గల అంబేడ్కర్ భవన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూదళితుడైన రాజకిషోర్‌ను ఉద్యోగంలో ఉండగా ఎస్బీఐ యాజమాన్యం అకారణంగా సస్పెండ్ చేసిదని, పదవీ విరమణ చేసినప్పటికీ కక్ష సాధింపు చర్యలు ఆపలేదని, రావలసిన బకాయిలు ఇప్పటికి ఆయనకు చెల్లించలేదని అవేదన వ్యక్తం చేశారు. వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విదసం ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, భూపతి, కోన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీకి విశాఖ జట్టు



రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొననున్న జట్టు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి అండర్-15 బాలురు, బాలికల టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే విశాఖ జట్టును గురువారం ప్రకటించారు. కాకినాడలో జరిగే ఈ టోర్నీలో బాలికల విభాగంలో రేణుక సత్య, ఆరిఫా సుల్తానా, దీక్షిత, సెవిత శ్రీ....బాలుర విభాగంలో వి.హార్థిక్ రామ్, సాయిచరణ్, లిఖిత్, జాషువా ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు గురువారం క్రీడా దుస్తులు (ట్రాక్ షూట్) పంపిణీ చేశారు. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాదుస్తులు అందజేసి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ డీఎస్‌వై శర్మ, టెక్నికల్ కమిటీ మాజీ చైర్మన్ పీవీఎన్ సూర్యారావు, డీఎస్ఏ కోచ్ అచ్యుత్, మురళి పాత్రో, శేఖర్, వీఎస్ఎన్ మూర్తి, శ్రీకాంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులో 'అరకు ఉత్సవ్'

» 3 రోజుల పాటు నిర్వహణ » అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ వెల్లడి

పాడేరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'అరకు ఉత్సవ్'ను ఈ నెలాఖరులో నిర్వహించనున్నామని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు.

'ఉత్సవ్' ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో గురు వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటకులను అలరించేలా అరకు ఉత్సవ్‌ను నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పట్టణం మరింత సుందరంగా కనిపించేలా విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు.

అలాగే ఉత్సవ్ ప్రాంగణంలో వివిధ రకాల స్టాళ్లను పెట్టాలని, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మారథాన్, చిత్రలేఖనం, రంగోలి, కార్నివాల్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అలాగే గులాబీల ప్రదర్శన, హాట్ ఎయిర్ బెలూన్, కాఫీ రుచుల పోటీలు, గిరిజన కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలు ఏర్పాటుచేయాలన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

ఎస్.రాయవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలంలోని ఒక గ్రామంలో మతిస్థిమితం లేని యువతి (20)పై కె.నాగరాజు (43) అత్యాచారానికి పాల్పడినట్టు గురువారం ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం... మతి స్థిమితం లేని యువతి ఒంటరిగా నడిచి వెళుతుండడం గమనించి అదే గ్రామానికి చెందిన నాగరాజు తన ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడైన నాగరాజును అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వర్షం దెబ్బకు చిత్తడిగా రహదారులు

మురళీనగర్, డిసెంబరు 19 ; అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు చిత్తడిగా తయారయ్యాయి. గ్రేటర్ విశాఖ 51వ వార్డు మాధవధార నరసింహనగర్, లాన్సమ్ గ్రీన్ రోడ్డు, 50వ వార్డు మురళీనగర్ సెక్టార్ 8 రోడ్లు, 49వ వార్డు మాణిక్యాంబకాలనీ తదితర ప్రాంతాలు సహా మాధవధార రామన్న కాలనీ, ఏకలవ్య కాలనీ ప్రాంతాల్లో వాన నీరు ముంచెత్తింది. బురద రోడ్లుగా ఉన్న మార్గాల్లో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. బిర్లా జంక్షన్ పాస్‌పోర్టు ఆఫీసు ఎదుట హైవే రోడ్డు సర్వీసు రోడ్డులో ఇలాంటి ఇబ్బందులతో గురువారం స్థానికులు ఇక్కట్లపాలయ్యారు

గోడౌన్ సూపర్‌వైజర్లు అరెస్టు

... 5వ పేజీ తరువాయి

సేకరించినవేనని తేలడంతో మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గోడౌన్ సూపర్‌వైజర్‌లుగా ఉన్న బుజ్జి, సుధాకర్ అనేవారిని బుధవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. అయితే రిమాండ్‌కు న్యాయస్థానం నిరాకరించడంతో గురువారం స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఈ కేసులో దాదాపు 11 కంటెయినర్‌లను పోలీసులు సీజ్ చేశారు. కార్డుదారుల నుంచి వేర్వేరు మార్గాల్లో సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రదేశంలో ప్యాకింగ్ చేసి రాత్రి సమయంలో గోదాములకు తరలించి, అక్కడి నుంచి నౌకల ద్వారా విదేశాలకు పంపుతున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసును మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ ఎస్ఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

4న నౌకాదళ విన్యాసాలు

... 5వ పేజీ తరువాయి

పర్యటించి ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. తూర్పు నౌకాదళానికి చెందిన అధికారి ఒకరు మాట్లాడుతూ నాలుగో తేదీ సాయంత్రం బీచ్‌లో ఓపీ డెమో జరుగుతుందని, లేజర్‌షో, డ్రోన్‌షో, నౌకల పైనుంచి విన్యాసాలు ఉంటాయన్నారు. జనవరి రెండో తేదీన పూర్తిస్థాయి రిహార్సల్స్ జరుగుతాయన్నారు. నేవీ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం పూర్తిగా సహకరించాలని కోరారు. సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ అజిత వేజెండ్ల, నేవీ అధికారులు వైకే కిషోర్‌కుమార్, సంజీవ్‌శరణ్, ఉజైర్ కుస్రో, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ ఊయల

... 5వ పేజీ తరువాయి

ఊయలలు ఏర్పాటుచేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ఊయల పర్యవేక్షణ బాధ్యతను స్థానిక ఏఎన్ఎంకు అప్పగిస్తారు. ఊయల వద్ద బెల్ ఏర్పాటుచేస్తారు. ఎవరైనా బిడ్డను వదిలి వెళుతుంటే బెల్ కొట్టాల్సి ఉంటుంది. అయితే, దానివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని అధికారులు చెబుతున్నారు. బిడ్డను వద్దనుకుని వెళ్లివాళ్లు బెల్ ఎందుకు కొడతారని ప్రశ్నిస్తున్నారు.

శిశువులు దత్తత

ఊయలలో వేసే చిన్నారులకు సంబంధించిన వివరాలతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఒక ప్రకటన ఇస్తారు. అందులో పేర్కొన్న వ్యవధిలోగా ఎవరైనా రాకపోతే శిశువులను బాల సదనాల్లో అప్పగిస్తారు. అనంతరం పిల్లలు కావాలనుకునే వారికి అధికారికంగా దత్తత ఇస్తారు.

బడ్జెట్ లేకున్నా బడాయి!

... 5వ పేజీ తరువాయి

విభాగాలకు కేటాయించిన నిధులు మిగిలి ఉంటే వాటిని సర్దుబాటు చేస్తే తప్ప కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లింపు సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ఆ విషయాన్ని ఇంజనీరింగ్ విభాగం అధికారులు గుర్తించకుండా పనులకు ప్రతిపాదించడం చర్చనీయాంశమైంది.

కాగా జీవీఎంసీ పరిధిలో రూ.50 లక్షలకు పైబడిన పనులు చేపట్టేందుకు, బిల్లుల చెల్లింపునకు కచ్చితంగా కౌన్సిల్‌లో చర్చించి ఆమోదించాలి. రూ.50 లక్షలు కంటే తక్కువ విలువైన పనులకు సంబంధించిన నిర్ణయాలు మాత్రమే స్టాండింగ్ కమిటీ తీసుకోవడానికి అధికారం ఉంటుంది. 84వ వార్డులో సీసీ రోడ్లు, ఆర్‌సీసీ కాలువలు నిర్మాణం కోసం రూ.1.39 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు వేసినందున ఆ అంశాన్ని కచ్చితంగా కౌన్సిల్ సమావేశంలో పెట్టాలి. వారం కిందటే కౌన్సిల్ సమావేశం జరిగింది. కానీ, అక్కడ ఆ అంశాన్ని అధికారులు పొందుపరచకుండా, మూడు ముక్కలుగా విభజించి ఒక్కొక్క పని విలువ రూ.50 లక్షల లోపునకు తగ్గించి వేర్వేరు అంశాలుగా స్టాండింగ్ కమిటీ ఎజెండాలో పొందుపరచడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

హెల్మెట్ ధారణపై స్పెషల్ ఫోకస్

... 5వ పేజీ తరువాయి

హెల్మెట్ ఉన్నప్పటికీ మరణించిన వారి సంఖ్య 30కి తగ్గింది.

హైకోర్టు ఆదేశాలతో తనిఖీలు మరింత ముమ్మరం:

రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని కారణంగా మూడు నెలల్లోనే 688 మంది మరణించడంపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. వాహన చోదకులు హెల్మెట్ ధరించేలా కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో నగరంలో తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జూలై నుంచి డిసెంబరు 18 వరకూ హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న 4,73,441 మందిపై కేసులు నమోదుచేసి వారి నుంచి రూ.4,73,44,100 వసూలుచేసేలా ఈ-చలాన్‌లు జారీచేశారు. పట్టుబడిన వారిలో 1,18,594 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు.

చాలావరకూ మార్పు కనిపిస్తుంది

సీపీ శంఖబ్రతబాగ్చి

నగరంలో హెల్మెట్ ధారణపై విస్తృతంగా అవగాహన కల్పించడం, ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ జరిమానాలు విధించడం, లైసెన్స్‌లు సస్పెన్షన్ చేయడంతో చాలావరకు మార్పు కనిపిస్తోంది. నేను సీపీగా బాధ్యతలు తీసుకున్నప్పుడు నగరంలో 20 శాతం హెల్మెట్ ధారణ ఉంటే ఇప్పుడు 50 శాతానికి పెరిగింది. వచ్చే ఫిబ్రవరి నాటికి శతశాతం చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం. పోలీసులను చూసి కొంతమంది హెల్మెట్ పెట్టుకుంటున్నారు. దాటగానే హెల్మెట్ తీసి మళ్లీ పక్కనపెడుతున్నారు. అలాంటి వారికి చెక్ పెట్టడానికి తగరపువలస నుంచి కూర్మన్నపాలెం వరకు ఉన్న సిగ్నల్స్‌తోపాటు నగరంలోని అన్ని సిగ్నల్స్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ కలిగిన ఆటోమెటిక్ ఫేసియల్ రికగ్నైజేషన్ కెమెరాలు ఏర్పాటుచేయబోతున్నాం. ఈ నెలాఖరుకు డీపీఆర్ ఖరారైపోతుంది కాబట్టి జనవరి చివరి నాటికి ఈ సదుపాయం అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల ట్రిపుల్ రైడింగ్ చేసినా, హెల్మెట్ ధరించకపోయినా, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా, సిగ్నల్ జంపింగ్ చేసినా ఆటోమెటిక్‌గా ఫొటోతో ఈ-చలాన్ జారీ అయిపోతుంది. ఆ సమాచారంతోపాటు వాహనం నడిపేవారి ముఖం ఫొటో కూడా తీయడం వల్ల వారి వివరాలన్నీ పోలీస్ శాఖతోపాటు రవాణా శాఖకు చేరతాయి. దాంతో వాహనం నడిపేవారి డ్రైవింగ్ లైసెన్స్ ఆటోమేటిక్‌గా సస్పెండ్ అయిపోతుంది. ఒకవేళ డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు అయితే వాహనం యజమానికి భారీ జరిమానాతో ఈ-చలాన్ చేరుతుంది. దీనివల్ల తప్పనిసరిగా అందరూ ట్రాఫిక్ నిబంధనలతోపాటు రహదారి భద్రతను పాటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

నేవీ ఉద్యోగి ఆత్మహత్య

మహారాణిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాన్వెంట్ జంక్షన్‌లో గల ఒక హోటల్‌లో నేవీ ఉద్యోగి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన ఆర్.రంజిత్‌కుమార్ (23) విశాఖలో నౌకాదళంలో పని చేస్తున్నాడు. అతను కొన్ని రోజులుగా సెలవులో ఉన్నాడు. ఈనెల 14న తమిళనాడు నుంచి నగరానికి వచ్చి కాన్వెంట్ జంక్షన్‌లోని ఒక హోటల్‌లో దిగాడు. బుధవారం అతను రూమ్ నుంచి బయటకు రాకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వెళ్లి రూమ్ తెరచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి ఫోన్‌లో ఉన్న నంబర్లు ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు, నేవీ అధికారులకు సమాచారం అందజేశారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు

డాబాగార్డెన్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. అమిత్ షా ఫొటోలను దహనం చేసి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరిడి భగత్ మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ అంబేడ్కర్‌ను తరచూ అవమానిస్తున్నాయన్నారు. అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గాంధీజీ, నెహ్రూతో పాటు అంబేడ్కర్‌ను బీజేపీ, ఆర్ఎస్ఎస్ అవకాశం దొరికనప్పుడల్లా అవమానిస్తున్నారన్నారు. ఇది దేశంలో ఉన్న దళిత, మైనారిటీ, సామాన్య ప్రజలపై దాడిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త కేవీ సూర్యనారాయణ, నాయకులు సోడాదాసు సుధాకర్, చిన్నబాబు, జగన్ మురారి, కస్తూరి, అప్పారావు, కాండవ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో...

అంబేడ్కర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని దళిత సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. వారు డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవుడా అంటే పుణ్యమైనా వస్తుందని, అంబేడ్కర్‌ను తలిస్తే ఏమీ వస్తుందని అమిత్ షా అవమానకరంగా మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కల్యాణరావు, ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, శాంతారావు, పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు



కనక మహాలక్ష్మి అమ్మవారు

కనకమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

» మూడో వారమూ తగ్గని తాకిడి
» కిటకిటలాడిన క్యూ లైన్లు
» బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రాత్రి వరకూ రద్దీ

జగదాంబ కూడలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మూడో గురువారం కూడా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రాత్రి వరకూ ఒకే విధమైన రద్దీ కొనసాగింది. రూ. 500, రూ. 200, రూ. 100 దర్శనాల క్యూలు ప్రధాన ఆలయం నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు నిండిపోయాయి. ఆలయ ఆవరణలో ఎక్కడ చూసినా భక్తజన సందడి నెలకొంది. నగరం నలుమూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కూడా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారి నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వీఐపీలు, వీవీఐపీలతో సంబంధం లేకుండా సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాల కోసం సిఫార్సు లేఖలతో వచ్చిన వారు పీఆర్‌ఓ కార్యాలయం వద్ద బారులు తీరారు. ఉత్సవాల్లో భాగంగా 3 నుంచి 5 గంటల మధ్య ఈ దర్శనాలకు అవకాశం కల్పించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధుల లేఖలతో వచ్చిన వారికి విక్టోరియా ఆసుపత్రి వద్ద వీఐపీ, వీవీఐపీ దర్శనాలకు క్యూ లైన్ ఏర్పాటు చేశారు. అడ్డగోలు దర్శనాలకు బ్రేక్ వేసేందుకు పోలీసులు, దేవస్థానం అధికారులు పకడ్బందీగా వ్యవహరించారు. వన్ టౌన్ సీఐ దేముడుబాబు ఆలయ ఆవరణలో తిరుగుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అధికారులు క్యూలైన్లలో ఉన్న వారికి తాగునీరు, మజ్జిగ, పిల్లలకు బిస్కెట్లు అందజేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేప ట్టారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో శోభారాణి, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

స్వర్ణ వస్త్రాలంకరణలో కన్యకా పరమేశ్వరి

మహారాణిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వన్ టౌన్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని గురువారం స్వర్ణ వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు, అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో అభిషేకం జరిపారు. సాయంత్రం వందలాది మహిళలతో సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం జరిపారు. ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా క్రిస్మస్ దీపారాధన

అల్లిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాపురం దరి పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ దీపారాధన ఘనంగా నిర్వహించారు. క్రీస్తు భక్తులంతా జ్ఞానాపురం వీధుల్లో కొవ్వొత్తులతో క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ.. ప్రదక్షిణ చేశారు. అనంతరం సిలువ గుర్తు మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్, సహాయ విచారణ కర్తలు వినయ్‌కుమార్, ఆంథోనిరాజ్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

జల సంరక్షణ పనులపై సమీక్ష

మహారాణిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టనున్న జల వనరుల సంరక్షణ పనుల్లో దాతలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. థాన్ ఫౌండేషన్, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయాలు, నిధుల సమీకరణపై గురువారం ఆయన తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జన వనరుల సంరక్షణకు చేపట్టనున్న చర్యలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం జల సంరక్షణకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

చిన్నారులకు దుస్తులు అందజేత

అల్లిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేఎన్‌ఆర్ ట్రస్టు ద్వారా నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. గురువారం ఆయన అల్లిపురం నేరెళ్ల కోనేరు వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో చిన్నారులకు దుస్తులు అందజేశారు.



గణేశునికి నివేదించిన కమలాలు

కమలాలతో గణేశునికి అర్చన

కూర్మన్నపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి ఎస్టీబీఎల్ ఎల్ఎస్ గార్డెన్స్‌లో శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలో గురువారం ప్రధాన అర్చకులు చంద్రమౌళీశర్మ పర్యవేక్షణలో భక్తులు సమర్పించిన 333 కమలా పండ్లతో ప్రత్యేక అర్చన, పూజలు నిర్వహించారు. అలాగే ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ ఆధ్వర్యంలో పూజలు, హోమం జరిపారు.

సామూహిక కనకమహాలక్ష్మి వ్రతాలు

శ్రీసత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 86, 87 వార్డుల పరిధి వడ్లపూడి, కణితి, కూర్మన్నపాలెంలలో సత్యసాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 333 మంది దంపతులతో సామూహిక కనకమహాలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు

అగనంపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో మార్గశిర గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని కొత్త వస్త్రాలు, పుష్పాలతో అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

అగనంపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందరంగా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పేదలకు దుప్పట్లు పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం సాయినాథునికి ప్రత్యేక పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

శరీర అవయవ దాతల సంఘం సహాయ కార్యదర్శిగా కార్తీక్



సీతామహాలక్ష్మి నుంచి నియామక పత్రం అందుకుంటున్న కార్తీక్

పెదగంట్యాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పల్లా కార్తీక్ నియమితులయ్యారు. గోపాలపట్నంలోని సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ (స్పెక్ట్) కార్యాలయంలో గురువారం స్పెక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి నుంచి ఆయన నియామక పత్రాలను అందుకున్నారు. శరీర అవయవ దాన ఉద్యమంలో తన శక్తి మేరకు పనిచేస్తానని కార్తీక్ పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 20, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 44, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 28, క్యారెట్ 40 దొండకాయలు 44, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది)56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరు చిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 36, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

హౌస్ కమిటీ నివాసితులందరికీ న్యాయం చేస్తాం

- రూట్ మ్యాప్ ప్రకారం 'గాజువాక' అభివృద్ధి
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హౌస్ కమిటీ ప్రదేశంలో నివాసం ఉంటున్న ప్రతిఒక్కరికీ అన్నివిధాలా న్యాయం చేస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 66, 67వ వార్డులకు సంబంధించిన రెవెన్యూ సదస్సును గాజువాక హైస్కూల్‌లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గాజువాకలో ఎన్నో ఏళ్లగా హౌస్ కమిటీ సమస్య నెలకొందని, ఇక్కడి లబ్ధిదారులకు అప్పట్లో టీడీపీ హయాంలో ఇళ్ల పట్టాలివ్వడం జరిగిందన్నారు. ఇంకా పెండింగ్‌లో వారికి కూడా న్యాయం చేస్తామని పల్లా పేర్కొన్నారు. అర్హులందరికీ న్యాయం న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్నారు. గాజువాక నియోజకవర్గ అభివృద్ధిపై ఓ రూట్ మ్యాప్ సిద్ధం చేశామని, ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఈ సదస్సులో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొత్తగా పట్టాలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని పల్లా శ్రీనివాసరావు సూచించగా.. అందుకు స్పందించిన తహసీల్దార్ శ్రీవల్లి దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించాక తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, ఇమ్రాన్, బొడ్డు నరసింహపాత్రుడు, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, ఎండీ రఫీ, మహ్మద్ ముర్తజా, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

- పలు సమస్యలను కేంద్ర మంత్రి కుమారస్వామికి నివేదించాం
- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ



సమావేశంలో పాల్గొన్న పోరాట కమిటీ చైర్మన్లు, నాయకులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, కర్మాగారంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చేయూతనందించాలని కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామిని కోరామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ చైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రూ.18 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. అయితే రూ.తొమ్మిది వేల కోట్లు ఇచ్చేందుకు ఆర్థికశాఖ స్పందించిందని కేంద్ర మంత్రి చెప్పారని, జనవరి 15 నాటికి ఉక్కు కర్మాగార సమస్యలన్నీ సమసిపోతాయన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలనీ, సొంత గనులు కేటాయించాలని, సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని, నిర్వాసితులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలనీ, మూడేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం ట్యాక్స్ హాలిడేను ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లపాటు విద్యుత్ బిల్లులను వాయిదా వేయాలని, తదితర సమస్యలతో పాటు రా మెటీరియల్ కొనుగోలు, తయారైన ఉత్పత్తుల అమ్మకాల్లో జరుగుతున్న అవకతవకలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంటును ఆదుకుంటామనీ కుమారస్వామి హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో నాయకులు జె.అయోధ్యరామ్, కేఎస్ఎన్ రావు, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి, రమణ, మసేన్‌రావు, సుబ్బయ్య, దేముడు, వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

కూర్మన్నపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం కేబీఆర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ టీకే నాయుడు, ఏడీఈ రామకృష్ణ, ఏఈ వీర్రాజులు తెలిపారు. ఈ కారణంగా శాతవాహన నగర్, యాతపాలెం, ముస్తఫా జంక్షన్, భరత్‌నగర్, కూర్మన్నపాలెం, ఐటీఐ రోడ్డు, గౌరీ నగర్, అశోక్ నగర్, శివాజీ నగర్, ఆల్ ఇండియా స్టేషన్ రోడ్డు, వవసాయి నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

షీలానగర్ సబ్ స్టేషన్ పరిధిలో..

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతు న్నందున శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఈ కారణంగా షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం, గవర జగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, పోర్టు రోర్డు ఏరియా, కిమ్స్ ఆస్పత్రి ఆస్పత్రి ఏరియా, కుమిలి లేఅవుట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి

డీఈవో ప్రేమ్‌కుమార్



పదో తరగతి విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవడంతో పాటు వాటి సాధనకు అకుంఠిత దీక్షతో శ్రమించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమకుమార్ సూచించారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వంటి అంశాలను డీఈవో పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధన సాగాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం, కుమారస్వామి, రవిచంద్, తదితరులు ఉన్నారు.

దళితుల భూములకు రక్షణ కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న కార్పొరేటర్ రమేశ్



వినతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందకుమార్

పెందుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బడా వ్యక్తుల చేతిలో ఆక్రమణలకు గురవుతున్న భూములకు రక్షణ కల్పించాలని పెందుర్తి మండలం వాలిమెరక గ్రామంలోని దళితులు కోరారు. గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూముల అన్యాక్రాంతాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రాలు సమర్పించారు. సాగు కోసం ప్రభుత్వం మంజూరుచేసిన అసైన్‌మెంట్ భూముల్లో జగనన్న కాలనీ ఏర్పాటుకు కొంత భూములను వైసీపీ ప్రభుత్వం తీసుకుందని వివరించారు. మిగిలిన భూములను గ్రామంలోని వైసీపీ నాయకులు ఆక్రమించారన్నారు. కాగా దీనిపై విచారణ చేసి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. రెవెన్యూ సమస్యలపై సర్పంచి చంద్రవాణి వివరించారు. భూ హక్కులకు సంబంధించిన సమస్యలపై పలువురు రైతులు విన్నవించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ హరిప్రసూన, తదితరులు పాల్గొన్నారు. కాగా సదస్సులో మొత్తం 39 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

ప్రహసనంగా రెవెన్యూ సదస్సు

గోపాలపట్నం: గ్రేటర్89వ వార్డు కొత్తపాలెంలో గురువారం రెవెన్యూ సదస్సు ప్రహసనంగా ముగిసింది. ప్రజాప్రతినిధులతో పాట అధికారులు హాజరుకాకపోవడంతో కార్పొరేటర్ డి.వెంకట రమేశ్ సిచివాలయ సిబ్బందితోనే సదస్సు నిర్వహించారు. దీంతో రైతులు వెనుదిరిగారు. చోటానేతలు వేదికపైకి చేరుకున్నారు. జీవీఎంసీ వాటర్ సప్లై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సదస్సు వేదికపై కూర్చోవడం చర్చనీయాంశమయింది.

ద్రోణంరాజుకు కాంగ్రెస్ నేతల నివాళి



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

పెందుర్తిరూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ జయంతి గురువారం చినముషిడివాడలో గల ద్రోణంరాజు స్వగృహం వద్ద నిర్వహించారు. పెందుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కా రామునాయుడు ద్రోణంరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెందుర్తి ప్రాంత అభివృద్ధికి ద్రోణంరాజు చేసిన సేవలను కొనియాడారు. ముమ్మన మహలక్ష్మి నాయుడు, రాపర్తి వాసు, ముమ్మన కనకారావు, కిలపర్తి చెల్లయ్యమ్మ, అక్కిరెడ్డి రామారావు, ముమ్మన శ్రీనివాసరావు, రాపర్తి కిశోర్ పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

పెందుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరాన్ని విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ బి.విజయకుమార్, డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్పీల నుద్దేశించి మాట్లాడారు. ఇక్కడ శిక్షణ పొందిన డీఆర్పీలు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. స్త్రీశిశు, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. ఏఎంవో లక్ష్మి, మండల విద్యాశాఖాధికారి సువర్ణ, హెచ్.ఎం.చిన్మయి పాల్గొన్నారు.

టిఫిన్ దుకాణాల్లో దాడులు: 14 గ్యాస్ సిలిండర్లు సీజ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

మల్కాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గృహావసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను దుకాణాల్లో వాడుతుండడంతో అధికారులు దాడి చేసి 14 సిలిండర్లు సీజ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతంలో బ్లాక్‌లో గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్న వైనంపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో పౌర సరఫరాల శాఖాధికారులు స్పందించారు. మల్కాపురం, కంచరపాలెం ప్రాంతాల్లో హోటల్స్‌పై దాడి చేసి అనధికారికంగా వినియోగిస్తున్న 14 సిలిండర్లను సీజ్‌చేసి, నిర్వాహకులపై 6ఏ కేసులను నమోదు చేశారు.

పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించండి



ప్రతులను దహనం చేస్తున్న కార్మికులు

మల్కాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మల్కాపురంలో గురువారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పత్రాలను దహనం చేశారు. పార్టీ జోన్ నాయకుడు కె.పెంటారావు మాట్లాడుతూ కార్మికులకు ఈనెల 5న ఇవ్వాల్సిన జీతాలు ఇప్పటి వరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. పెరిగిన సరకుల ధరలు, విద్యుత్ చార్జీలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు.

వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్, కనకమహాలక్ష్మీనగర్‌లో రూ.19.82లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైన్లకు గురువారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఈ కాలనీలో గత ఐదు సంవత్సరాలుగా ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని, కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రధాన రహదారులు, కాలువల నిర్మాణం చేపట్ట డం జరిగిందన్నారు. లక్ష్మీనగర్ ఎఫ్‌బ్లాక్ అమ్మవారి పాదాల ప్రాంతాల్లో చేపడుతున్న రక్షణ గోడ పనులు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కాకానినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహనరావు, కార్యదర్శి సిద్ధ రాజాభాస్కర్, విమాన్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సురేష్, గోపాల్, శ్రీను, సతీష్, ఏఈ వెంకటలక్ష్మి రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడా మైదానానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్న

సింధియా: గ్రేటర్ 63వ వార్డు క్రాంతినగర్‌లో క్రీడా మైదానం ఏర్పాటు కోసం కార్పొరేటర్ గల్లా పోలిపిల్లి (చిన్నా) గురువారం భూమి పూజ చేశారు. క్రీడాకారులకు మైదానం ఎంతగానో ఉపయోపడుతుందని తెలిపారు. వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వర్షంలోనే రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

జల్లులతో రహదారులు జలమయం

గాజువాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గాజువాక పరిసరాల్లో ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి చిన్నాపాటి వర్షం కురుస్తుండడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. వర్షంతో పాటు చలిగాలుల తీవ్రత కూడా అధికంగా ఉండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టే సమయానికి మోస్తరు వర్షం పడడంతో ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు ఇక్కట్లకు గురయ్యారు.

ఇసుక సరఫరా కేంద్రం ప్రారంభం



అప్పన్న కాలనీలో ఇసుక సరఫరా కేంద్రాన్ని ప్రారంభించిన పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని, నగరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తక్కువ ధరకు ఇసుక సరపరా చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. 68 వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇసుక సరఫరా కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించా మాట్లాడారు. ఈ కేంద్రంలో టన్ను ఇసుక వెయ్యి రూపాయిలకు లభిస్తుందని, అవసరమైన ప్రజలు ఆన్‌లైన్‌లో గానీ నేరుగా సరఫరా కేంద్రానికి వచ్చి ఇసుక కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ఇసుక సరఫరా కేంద్రాలలో ధరలు పెంచినా, ఇతర అక్రమాలు చోటుచేసుకున్నా ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవల్లి, టీడీపీ 'గాజువాక' కన్వీనర్ ప్రసాదుల శ్రీనివాసరావు, వైసీపీ నాయకుడు గుడివాడ లతీశ్, జితేందర్‌రెడ్డి, సీఐ పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులను త్వరితంగా పూర్తి చేయాలి

పెదగంట్యాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి డెయిరీ కాలనీ గెడ్డపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులను త్వరితంగా పూర్తి చేయాలని టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు ఇంజనీరింగ్ అధికారులను కోరారు. గురువారం ఆయన వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులకు త్వరితంగా పూర్తి చేసి ప్రజల రాకపోకలకు తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించాలన్నారు.కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

సీజనల్ జర్వాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అగనంపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా సీజనల్ జర్వాలు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది సూచించారు. అగనంపూడి పరిసర ప్రాంతాల్లో గురువారం మలేరియా విభాగం, పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఎవరికైనా జ్వరమొస్తే తక్షణమే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. సిబ్బంది మహాలక్ష్మినాయుడు, లీలారాణి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి బాక్సర్లకు అభినందనలు

మల్కాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులను శ్రీహరిపురం జీవీఎంసీ మైదానంలో గురువారం జాతీయ క్రీడాకారుడు టి.శివశంకర్ అభినందించారు. నేర్చుకుంటున్న విద్యపట్ల శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం శంకర్‌ను మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. మజ్జి రమేష్, షేక్ అలీ, హరి, పాత్రుడు, శివారెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మల్కాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 58వ వార్డు ములగాడ గ్రామంలో దోమల నివారణకు గురువారం మలేరియా విభాగం సిబ్బంది ఫాగింగ్ చేశారు. దోమల బెడదపై స్థానికులు జీవీఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించి ఈ చర్యలు చేపట్టారు.

సందడిగా ధనుర్మాస ఉత్సవాలు



అమ్మవారికి పూజలు

పెందుర్తి, డిసెంబరు 19: ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా వేంకటాద్రి శిఖరంపై గల ఆలయంలో గురువారం హారతి, సేవా కాలం, శాత్తిమొరై, తిరుప్పావై పారాయణ, ప్రవచనం నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం 4గంటల నుంచే పూజలు, తిరుప్పావై నిర్వహించారు. లక్ష్మీనరసింహనగర్ గోపిజన వల్లభస్వామి ఆలయంలో వేడుకలను పురస్కరించుకొని భక్తులు దీపారాధన చేశారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మీనగర్‌లో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారికి మూడో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అకాల వర్షాలతో అవస్థలు



చిత్తడిగా మారిన ఐదు మదాల మార్గం

గోపాలపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షానికి లోతట్టు ప్రాంతాలు చిత్తడిగా మారాయి. గురువారం ఓ మోస్తరు వర్షం కురవడంతో శ్మశాన వాటిక కూడలిలో బీఆర్‌టీఎస్‌పై వర్షం నీరు నిల్వ చేరింది. రహదారిపై నిలిచి వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. వెంకటాపురం ఐదు మాదాల మార్గంలో రైల్వే సమస్య కారణంగా రహదారి నిర్మాణం జరగక పోవడంతో మదాల మార్గం చిత్తడిగామారింది. కొత్తపాలెం, నరవ, కోటనరవ, సత్తివానిపాలెం గ్రామాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు.

భాషా సేవకురాలు

సామాజిక అంశాలే ఇతివృత్తంగా రచనలు

సాహిత్య రంగానికి విశేష సేవలందించి, కథలు, కవితలు, పద్యాలు, వ్యాసాలు, గేయాలు, సీరియల్స్, గొలుసుకట్టు నవలలు, గ్రంథ సమీక్షలతో భాషకు, సాహిత్యానికి వన్నె తెస్తున్నారు ఆచార్య దేవులపల్లి పద్మజ. దేశభక్తి సాహిత్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా శాస్త్రవేత్తల మనోఫలకాలను ఆవిష్కరించేలా రచనలు సాగిస్తున్నారు. సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో భాగమయ్యేలా ప్రసంగాలు చేశారు.

- పెదగంట్యాడ, ఆంధ్రజ్యోతి

» సాహిత్యానికి వన్నె తెచ్చేలా కథలు, కవితలు

» సంస్కృత భాషకు ప్రచారం కల్పించేలా ఉచిత సంధ్యా పాఠశాల ఏర్పాటు

» జానపద సాహిత్యంపై విదేశీ వేదికపై ప్రసంగాలు

» ప్రశంసలందుకుంటున్న రచయిత్రి ఆచార్య దేవులపల్లి పద్మజ

తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన దేవులపల్లి పద్మజ తండ్రి చెరుకూరి సూర్యానారాయణ ఆటోమొబైల్ ఇంజనీరు, తల్లి కామేశ్వరి గృహిణి. కాకినాడలోనే ప్రాథమిక, ఉన్నత, కళాశాల విద్యను అభ్యసించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువులు కొనసాగించారు. చిన్నప్పటి నుంచి రచనాసక్తి ఉండడంతో ఎనిమిదో తరగతిలోనే మువ్వన్నెల జెండా శీర్షికన జాతీయ జెండాపై రాసిన కవిత ప్రశంసలందుకుంది. అప్పటి నుంచి రచనా ప్రస్థానం సాగిస్తున్న పద్మజ విశాఖకు చెందిన టీబీఆర్ఆర్ శర్మను వివాహం చేసుకున్న అనంతరం ఇక్కడే స్థిరపడ్డారు. ప్రస్తుతం గోపాలపట్నంలోని ఏయూ అనుబంధ కళాశాలలో ఆచార్యురాలుగా పనిచేస్తున్నారు. ఆమె భర్త టీబీఆర్ శర్మ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసి ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు.



ఆచార్య పద్మజను సత్కరిస్తున్న తెలుగు రచయితల సంఘం

భాషా సేవకు...

పద్మజ ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంకాం, ఎంఏ (తెలుగు), ఎంఏ (సంస్కృతం), సంస్కృతంలో పీహెచ్‌డీ చేశారు. సంస్కృత భాషకు విస్తృత ప్రచారం కల్పించేందుకు కృషి చేశారు. ఇందులో భాగంగా ఉచిత సంధ్యా పాఠశాల ఏర్పాటు చేశారు. తెలుగు- మాతృభాషా పరిరక్షణ సమితి ద్వారా మాతృభాషకు విస్తృత ప్రచారం కల్పించారు. ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ఆన్‌లైన్ ద్వారా భగవద్గీత తరగతులు నిర్వహించారు. దేశవ్యాప్తంగా సుమారు 1500 మందికి భగవద్గీత నేర్పించారు. శతావధానాలు, సహస్రావధానాల్లో పృచ్ఛకురాలిగా వ్యవహరించారు.



రచయిత్రి ఆచార్య దేవులపల్లి పద్మజ



పద్మజ రాసిన పుస్తకాల్లో కొన్ని...

స్వీయరచనలు

మల్లెలు కవితాసంపుటి, శ్రీకృష్ణమనోహరం శతకం, శ్రీరామాయణంలో మహర్షులు, ప్రకృతి పలుకుల్లో లోక రీతులు శతకం, సౌగంధి కవితా సంపుటి, ఉపనిషత్సార సంగ్రహం, వ్యాస సాహితి, భాష, భాషావేత్తల వ్యాసాలు, శ్రీమానస కథల సంపుటి, శ్రీహరినామావళి, నాటి కలలే - నేటి కన్నీళ్ళా చరిత్ర, కేజీ టు పీజీ సంస్కృత వ్యాకరణసూత్ర సంకలనం, సుభాషిత భాస్కరం శతకం,మంజూష లఘు నవల,వ్యాససాహితి -2 గణేశ గీతాలు పద్మజ రచనల్లో ప్రధానమైనవి.

బిరుదులు, సత్కారాలు

హైదరాబాద్ విశ్వసాహితి, అఖిల భాషా సాహితీ సమాఖ్య భోపాల్, మంచిర్యాల రచయితల సంఘం, ఉపాధ్యాయుల సంఘం,అఖిల భారత బ్రాహ్మణ సంఘం నుంచి పలు బిరుదులందుకున్నారు. బెంగళూరు సాహిత్య అకాడమీ, వాసవికన్యకాపరమేశ్వరి ట్రస్ట్ హైదరాబాద్, విశ్వసాహితీ, విజయనగరం గీతా చారిటబుల్ ట్రస్ట్ నుంచి గురజాడ తదితర పురస్కారాలు అందుకున్నారు.

ఆకాశవాణిలో ప్రసంగాలు

దేవులపల్లి పద్మజ ఆకాశవాణి విశాఖపట్నం, హైదరాబాద్ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు తెలుగు, సంస్కృత భాషల్లో 58కి పైగా ప్రసంగాలు చేశారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, సంస్కృత భాషల్లో 400కు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించారు.

విదేశీ వేదికపై

విదేశీ వేదికపై ప్రసంగం చేశారు. ఖతార్‌లోని దోహా పట్టణంలో వంగూరి ఫౌండేషన్, ఆంధ్ర కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో జానపద గేయ సాహిత్యంపై ప్రసంగించారు. ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు నిర్వాహకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

ఎంటెక్ విద్యార్థిని ఆత్మహత్య

» మృతురాలి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా



శిరీష (ఫైల్ ఫొటో)

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంవీపీ ఐదో సెక్టార్‌లో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా గొటివాడ గ్రామానికి చెందిన సోమినేని శిరీష (23) ఏడాదిన్నరగా ఎంవీపీలోని తన అక్క, బావ కింజరాపు అశోక్‌కుమార్ దంపతుల ఇంట్లోనే ఉంటూ నగరంలోని ఓ కళాశాలలో చదువుకుంటోంది. ఆరు నెలల కిందట ఈమెకు తన బంధువుతోనే వివాహం జరిగింది. భర్త శ్రీకాకుళంలో ఉంటాడు. చదువు పూర్తిచేయడం కోసం శిరీష విశాఖలో ఉంటోంది. ఈమె తండ్రి అనారోగ్యంతో నెల రోజుల కిందటే మృతిచెందారు. కాగా గురువారం శ్రీకాకుళంలో జరిగే శుభ కార్యక్రమానికి శిరీష అక్క, బావ సోమవారం వెళ్లారు. తాను ఆరోజు వస్తానని చెప్పిన శిరీష ఇక్కడే ఉండిపోయింది. తనకు భయం లేదని, రాత్రి సమయంలో తన స్నేహితురాలి వద్దకు వెళ్తానని చెప్పింది. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆమె అక్క ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో నగరానికి బయలుదేరిన తన భర్తకు సమాచారం ఇచ్చింది. అతడు ఇంటికి చేరుకుని తలుపులు కొట్టినా స్పందన లేకపోవడంతో గడియ తొలగించి చూడగా బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ జె.మురళి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈమె అప్పుడప్పుడు నిద్ర మాత్రలు వేసుకునేదని సమాచారం. కాగా బుధవారం కళాశాలలో మామూలుగానే ఉందని, రెండు రోజుల కిందట అరకు వెళ్లి వచ్చామని అప్పుడూ సాధారణంగానే ఉందని శిరీష స్నేహితులు పోలీసులకు తెలిపారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

» ఎన్నికల జాబితా రాష్ట్ర పరిశీలకుడు ప్రవీణ్ కుమార్

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకుడు, గనులశాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.గతంలో జరిగిన సంఘటనలను పరిగణనలో తీసుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా అధికారులతో సమావేశమై ఓటరు జాబితా సంక్షిప్త సవరణ- 2025 ప్రక్రియపై సమీక్షించారు. స్థానిక జనాభాకు, ఓటర్లకు మధ్యనున్న వ్యత్యాసానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులకు నిర్ణీత సమయంలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఉన్నతస్థాయిలో అధికారుల నుంచి కింది స్థాయి అధికారులకు సరైన సమాచారం అందాలని, ఓటరు జాబితా రూపకల్పనలో సమన్వయంతో పనిచేయాలన్నారు. రాజకీయపార్టీల ప్రతినిధులను భాగస్వాములను చేసుకుంటూ వెళ్లాలని, వారి సూచనలు, సలహాలను పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు జాబితాలు పరిశీలించి జనాభా, ఓటరు నిష్పత్తికి భారీ వ్యత్యాసం ఉంటే క్షేత్రస్థాయి నిశిత పరిశీలనచేసి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఓటరు సవరణ ప్రక్రియకు తీసుకున్న చర్యలను కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ వివరించారు. తాజాగా అక్టోబరు 29న ప్రచురించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 20,14,236 మంది ఓటర్లు న్నారని, జండర్ నిష్పత్తి 1,027గా ఉండగా, జీపీ నిష్పత్తి 752గా ఉందన్నారు. ముసాయిదా జాబితాపై 4,275 అభ్యంతరాలు రాగా వాటిలో 3,855 పరిష్కరించామని, 420 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు క్షేత్రస్థాయిలో సేకరించిన పలు అంశాలను పరిశీలకుల దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఓటరు జాబితాలో తప్పిదాలు జరిగాయని, జనాభా, ఓటరు నిష్పత్తికి మధ్య భారీ వ్యత్యాసం వచ్చిందన్నారు. బోగస్ ఓటర్లను గుర్తించి అధికారులకు నివేదించామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానిశంకర్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు ప్రవీణ్ కుమార్

ప్రభుత్వ పథకాలను చిత్తశుద్ధితో అమలుచేయండి

పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ అన్నారు. జడ్పీ సమావేశమందిరంలో గురువారం ఉమ్మడి జిల్లా ఎంపీడీవోలు, ఈవోఆర్డీలతో ఆయన వేర్వేరుగా సమావేశమై మాట్లాడారు. పంచాయతీల్లో 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, విశాఖ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ

కొత్త సాఫ్ట్‌వేర్‌ను సమర్థంగా వినియోగించుకోవాలి

ద్వారకాబస్‌స్టేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) నూతనంగా ఆవిష్కరించిన సాఫ్ట్‌వేర్‌ను ఆర్టీసీ అధికారులు సమర్థంగా వినియోగించుకోవాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు కోరారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల డిపోమేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లకు ఏపీజీఎల్ఐ అధికారులు నూతన సాఫ్ట్‌వేర్ వినియోగంపై గురువారం రీజనల్ మేనేజర్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఏపీజీఎల్ఐ ప్రాముఖ్యత, బాండ్ల జెనరేషన్, ఉద్యోగ విరమణ సెటిల్మెంట్లు, మరణ క్లైంలు, రుణ దరఖాస్తులు అప్‌లోడ్ చేసే విధానం వివరించారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సాఫ్ట్‌వేర్ వినియోగం, లాభాలు వివరించారు. సందేహాలను నివృత్తి చేశారు. ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.



సాఫ్ట్‌వేర్‌పై వివరిస్తున్న ఏపీజీఎల్ఐ అధికారి

రెయిన్‌బో ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

» శిశువు ప్రాణాలు కాపాడడంతో పాటు దృష్టి దోషం తొలగించిన వైద్యుల బృందం

ఆరిలోవ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హెల్త్ సిటీలో గల రెయిన్ బో చిల్డ్రన్ ఆస్పత్రి వైద్యులు.. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యుల సహకారంతో ఓ శిశువు గుండెకు శస్త్రచికిత్స చేయడంతో పాటు అంధత్వం రాకుండా నివారించగలిగారు. వైద్యుల బృందం 33 వారాల కవల శిశువుకు రెయిన్ బో చిల్డ్రన్ ఆస్పత్రిలో చికిత్స చేశారు. కేవలం 1.5 కిలోల బరువున్న శిశువుకు పుట్టుకతో హృదయ సంబంధిత సమస్యతో పాటు కళ్లకు గ్లకోమా సమస్య ఉన్నట్టు గుర్తించారు. ఆ శిశువుకు శస్త్రచికిత్సలు చేయడం ద్వారా ప్రాణాలు కాపాడడంతో పాటు దృష్టి లోపం లేకుండా చేయవచ్చని నిర్ధారణకు వచ్చారు. దీంతో రెయిన్ బో చిల్డ్రన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పీడియాట్రిక్ కార్డియోథొరాసిన్ సర్జన్ డాక్టర్ చౌహాన్ అభినవ్ సింగ్ ఆధ్వర్యంలో వైద్యుల బృందం గుండెకు విజయవంతంగా సర్జరీ చేసి ప్రాణాలు కాపాడారు. అలాగే ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యులు దివ్య దంగేటి, శివాని కొడాలి గ్లకోమా శస్త్రచికిత్స చేసి ఆ శిశువును అంధత్వం లేకుండా చేయగలిగారు. చిల్డ్రన్ ఆస్పత్రి ఎస్ఐసీయూ డాక్టర్ మందుల పణిప్రియ, కన్సల్టెంట్ నియోనాలజిస్టులు డాక్టర్ సతీష్ వాడపల్లి, డాక్టర్ శ్రీలత పులి ఆ శిశువుకు సరైన వైద్యం అందించే విషయంలో కీలక పాత్ర వహించారు. తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టడంతో పాటు దృష్టి ప్రసాదించిన వైద్యుల సహకారం మరువలేమని శిశువు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

విశాఖలో శ్రీలెదర్స్ షోరూమ్ ప్రారంభం



శ్రీలెదర్స్ సంస్థ ఉత్పత్తులు ప్రదర్శిస్తున్న ప్రతినిధి సుశాంత దే, తదితరులు

మహారాణిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భారతీయ ఫుట్‌వేర్ పరిశ్రమలో సుమారు ఏడు దశాబ్దాలుగా ప్రఖ్యాతి గాంచిన శ్రీలెదర్స్ సంస్థ రాష్ట్రంలో మొదటిసారిగా నగరంలో రిటైల్ అమ్మకాలను ప్రారంభించింది. జిల్లా కోర్టురోడ్డు సింగ్ హోటల్ జంక్షన్‌లో ఆ సంస్థ నూతన షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి సుశాంత దే మాట్లాడుతూ 1952లో స్వాతంత్ర్య సమర యోధుడు సురేశ్ చంద్ర దే స్థాపించిన శ్రీలెదర్స్ సౌకర్యవంతమైన ఫుట్‌వేర్‌కు పెట్టింది పేరన్నారు. వినియోగదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన లెదర్ వస్తువులను తమ సంస్థ అందిస్తుందని చెప్పారు. బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్ వంటి క్రీడాకారుల కోసం ప్రత్యేక స్పోర్ట్స్ షూ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. స్టైలిష్ ఫుట్‌వేర్, బ్యాగులు, ట్రావెల్‌బ్యాగులు, లెదర్ ఉపకరణాలను కూడా సరసమైన ధరలకు అందిస్తున్నామని తెలిపారు.

ముమ్మరంగా గంజాయి కేసు దర్యాప్తు

మల్కాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఎంఐజీ క్వార్టర్స్ -1లో వెలుగుచూసిన గంజాయి కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. మల్కాపురం పోలీసులు దర్యాప్తు చేస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. ఇంటిని అద్దెకిచ్చిన యజమానిని, అద్దె డబ్బు ఫోన్‌పే చేసిన వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నారు. అద్దెకు తీసుకున్న ముగ్గురు పరారీలో ఉన్నారు. పట్టుబడిన గంజాయిని సీజ్ చేశారు. సీఐ ఎస్.విద్యాసాగర్ దర్యాప్తు చేస్తున్నారు. గ్లాజుల వ్యాపారం పేరుతో ఇంటిని అద్దెకు తీసుకున్న వారి ఆచూకీ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.

సొసైటీ పర్సన్ ఇన్‌చార్జుల కాల పరిమితి పెంపు

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 98 ప్రాథమిక సహకార పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జుల కాల పరిమితిని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. గత ప్రభుత్వం రాజకీయ పార్టీకి చెందిన ముగ్గురితో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ కమిటీలను రద్దు చేసి సహకార శాఖ ఉద్యోగులను పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించింది. వారి నియామకపు గడువు శుక్రవారంతో ముగియనున్నది. దీంతో శనివారం నుంచి మరో ఆరు నెలలపాటు పర్సన్ ఇన్‌చార్జులను పొడిగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈలోగా సంఘాలకు ఎన్నికలు జరిగితే గడువు ముగుస్తోందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

రైతుబజార్ల ఈఓల బదిలీలు

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు (ఈఓలు), సూపర్‌వైజర్లను బదిలీ చేస్తూ జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖాధికారి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం 13 బజార్లు ఉండగా ఇద్దరిని ప్రస్తుత బజార్లలోనే కొనసాగిస్తూ మిగిలిన 11 మందిని బదిలీచేశారు. ఎంవీపీ రైతుబజార్ ఈఓ ప్రసాద్‌ను గోపాలపట్నం, సీతమ్మధార రైతుబజార్ ఈఓ కొండబాబును నరసింహనగర్, మధురవాడ రైతుబజార్ ఈఓ జగదీశ్వరరావును కంచరపాలెం, పెదవాల్తేరు ఈఓ వరలక్ష్మిని గాజువాక, నరసింహనగర్ ఈఓ చిన్నబాబును స్టీల్‌ప్లాంటు, కంచరపాలెం ఈఓ కృష్ణమూర్తిని సీతమ్మధార, మర్రిపాలెం ఈఓ వరహాలును ఎంవీపీ కాలనీ, గోపాలపట్నం ఈఓ నారాయణరావును మర్రిపాలెం, గాజువాక సూపర్‌వైజర్ హరితను మధురవాడ, పెదగంట్యాడ ఈఓ సత్యకళను పెదవాల్తేరు, స్టీల్‌ప్లాంటు రైతుబజార్ ఈఓ మురళీకృష్ణను పెదగంట్యాడ రైతుబజార్‌కు బదిలీ చేశారు. వీరిని వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. పెందుర్తి ఈఓ షర్మిలను, ములగాడ ఈఓ జైసింహలను అక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

నేటి నుంచి కళాభారతిలో నృత్యోత్సవాలు

మద్దిలపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నుంచి మూడు రోజులు నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నామని విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కార్యదర్శి రాంబాబు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ప్రదర్శనలను తిలకించి, ప్రోత్సహించాలన్నారు.